

16లో

నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండ..




కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 31, జులై 2026 16 పేజీలు

నగరానికి మెట్రో ఊపు..!



సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఘన శ్రీకారం

మూడు రూట్లలో తొలి విడత సేవలు ప్రారంభం..

త్వరలో మరిన్ని మార్గాలకు విస్తరణ

బస్సులో ప్రయాణించి సేవలను ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: కరీంనగర్ నగర ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఆధునిక, వేగవంతమైన ప్రజా రవాణా సేవలను నగరవాసులకు చేరువ చేస్తూ సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు గురువారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ నూతన సేవలను ఘనంగా ప్రారంభించారు. నగర విస్తరణ, పెరుగుతున్న ట్రాఫిక్, ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ సేవలను ప్రారంభించడం ప్రజా రవాణా రంగంలో మరో కీలక ముందడుగుగా నిలిచింది.

ప్రారంభోత్సవం అనంతరం మంత్రి స్వయంగా కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణించారు.

2లో

మూలవాగుకు జలకళ...



2లో

కట్టకు గండం..!

19 అడుగుల సామర్థంలో 15 అడుగులకు చేరిన నీటి నిల్వ

ఎడమ కాలువ తూము వద్ద బుంగ..

అప్రమత్తమైన అధికారులు.. ఇసుక బస్తాలతో తాత్కాలిక రక్షణ..

కట్ట భద్రతపై రైతుల్లో ఆందోళన

కోనరావుపేట రూరల్, ప్రభాతవార్త: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు కళకళలాడుతోంది. గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో నీరు చేరని ప్రాజెక్టు ఈసారి వరద ప్రవాహాలతో వేగంగా నిండుతుండటంతో రైతుల్లో ఆనందం నెలకొంది. అయితే మరోవైపు ప్రాజెక్టు కట్టలో తలెత్తిన లోపం ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు జలాశయం నిండుతుండగా, మరోవైపు ఎడమ కాలువ తూము వద్ద బుంగ ఏర్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 19 అడుగులు కాగా, ఇప్పటికే 15 అడుగుల వరకు నీరు చేరింది. ఎగువ ప్రాంతాలైన సిరికొండ, చీమనపల్లి, తాటిపల్లి, గర్జనపల్లి, వన్‌పల్లి గ్రామాల పరిసరాల్లో భారీ వర్షాలు కురవడంతో వరద ప్రవాహం నిరంతరంగా ప్రాజెక్టులోకి చేరుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొద్ది గంటల్లో లేదా ఒకటి, రెండు రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

భూగర్భ జలాల పెంపునకు జలసిరిని

విజయవంతం చేయాలి

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

కలెక్టరేట్‌లో జలసిరి, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష సమావేశం

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటుకు ఆదేశం

ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15 లోపు పూర్తి చేయాలని స్పష్టం



2లో

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: భూగర్భ జలాల పునరుద్ధరణే లక్ష్యంగా తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో విజయం సాధించేలా అమలు చేయాలి అని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ జలసిరి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామీణాభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు.

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని రకాల

ముందస్తు చర్యలు

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్..

ప్రాణ,ఆస్తి నష్టం జరుగకుండా సహాయక చర్యలు చేపట్టాలి

పునరావాస కేంద్రాలను అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలి

రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి

తహసీల్దార్లు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం



2లో

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితి పై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.

నగరానికి మెట్రో ఊపు..!

మొదటిపేజీ తరువాయి

ఆయనతో పాటు ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, ఈడీలు సాలోమన్, రాజశేఖర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా బస్సులో ప్రయాణించి సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మమేకమైన మంత్రి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ నగరానికి సిటీ బస్సుల అవసరం చాలా కాలంగా ఉందని, ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. నగర అభివృద్ధికి అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తొలి దశలో కరీం నగర్–వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్–చింతకుంట, కరీంనగర్–కొత్తపల్లి హవేలీ మార్గాల్లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తాయని చెప్పారు. ఈ రూట్లు విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, రోజువారీ ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేసినట్లు వివరించారు.వాగేశ్వరి విద్యాసంస్థలకు ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు ప్రయాణిస్తుంటారని, అలాగే చింతకుంట, ఓద్యారం, కొత్తపల్లి ప్రాంతాల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు అధిక సంఖ్యలో నగరానికి వస్తుంటారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ సేవలు వారికి సమయం, ప్రయాణ ఖర్చు ఆదా చేయడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తాయని తెలిపారు.

నగర విస్తరణకు అనుగుణంగా కొత్త రూట్లు

కరీంనగర్ వేగంగా విస్తరిస్తోందని, అందుకు తగ్గట్టుగానే ఆర్టీసీ సేవలను కూడా విస్తరిస్తామని మంత్రి తెలిపారు. త్వరలోనే ప్రతిమ మెడికల్ కాలేజీ, చల్మడ, మానకొండూరు ప్రాంతాలకు కూడా సిటీ బస్సులను విస్తరించే ప్రణాళిక సిద్ధంగా ఉందన్నారు. ప్రజల నుంచి ఆదరణ పెరిగితే అవసరమైన చోట అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తులో 24 గంటల పాటు సిటీ బస్సులు నడిపే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.



మహాలక్ష్మీ పథకంతో మహిళలకు భరోసా

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని పెద్దఎత్తున వినియోగించుకుంటున్నారని మంత్రి తెలిపారు. ఈ పథకం వల్ల మహిళల ఆర్థిక భారం తగ్గడంతో పాటు ఉపాధి, విద్య, వైద్య అవసరాల కోసం మరింత స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశం కలిగిందన్నారు. మహిళల ఆదరణతో ఆర్టీసీపై ప్రజల విశ్వాసం మరింత పెరిగిందని చెప్పారు.

ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు కీలక చర్యలు తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. కొత్త బస్సుల కొనుగోలు, ఖాళీ పోస్టుల భర్తీ, డ్రైవర్లు, కండక్టర్ల నియామకాలు, పెండింగ్ బకాయిల చెల్లింపు వంటి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీ రోజుకు 35 లక్షల కిలోమీటర్లకు పైగా బస్సులు నడుపుతూ 65 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తోందన్నారు. దేశంలోనే అత్యుత్తమ ప్రజా రవాణా సంస్థగా ఆర్టీసీని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త రూట్లు, అదనపు సర్వీసులు, ఆధునిక సౌకర్యాలతో కూడిన బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని, నగర ప్రజలంతా సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ సేవలను వినియోగించుకొని ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్..

ప్రాణ,ఆస్తి నష్టం జరుగకుండా సహాయక చర్యలు చేపట్టాలి

పునరావాస కేంద్రాలను అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలి

రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి

తహసీల్దార్లు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితి పై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని తెలిపారు.తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధం, ఆహారం, వైద్య సదుపాయాలు తదితర అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి భోజనం, తాగునీరు, అవసరమైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా బ్లాక్ కాకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు డ్రింకింగ్ వాటర్ బృందాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొనారు.అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు.ఈ సమావేశం లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజ గౌడ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపునకు జలసిరిని విజయవంతం చేయాలి

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

కలెక్టరేట్‌లో జలసిరి, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష సమావేశం

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటుకు ఆదేశం

ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15 లోపు పూర్తి చేయాలని స్పష్టం

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: భూగర్భ జలాల పునరుద్ధరణే లక్ష్యంగా తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో విజయం సాధించేలా అమలు చేయాలి అని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ జలసిరి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామీణాభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యక్రమాల అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ గ్రామాల్లో తెలంగాణ జలసిరిని విజయవంతం చేయాలని అధికారులను కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తప్పని సరిగా ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పిస్తూ వారి అంగీకారంతో పంటకుంటలు ఏర్పాటు చేయాలని, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పంటకుంటల ఏర్పాటులో ప్రత్యేక చొరవ చూపాలని, ముఖ్యంగా ప్రతి ఆయిల్‌పామ్ రైతు తప్పనిసరిగా ఫార్మ్‌పాండ్ ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. జిల్లాలో ప్రతి బోర్‌వెల్ వద్ద రీచార్జ్ పిట్ ఏర్పాటు చేసి భూగర్భ జలాల పునరుద్ధరణకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలన్నారు. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15 లోపు పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణతో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో మంజూరు కాకుండా పెండింగ్‌లో ఉన్న ఇళ్లతో పాటు గుడిసెల్లో నివసిస్తున్న అర్హుల వివరాలను సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇంటి స్థల స్లాబ్ విస్తీర్ణం 750 చదరపు గజాలకు మించకుండా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికి 90 రోజుల ఉపాధి హామీ పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణానికి సంబంధించిన చెల్లింపులు సకాలంలో అందేలా పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకొని పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నరేందర్, డిఆర్‌డిఓ కాళిందిని, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మూలవాగుకు జలకళ... కట్టకు గండం..!

19 అడుగుల సామర్థంలో 15 అడుగులకు చేరిన నీటి నిల్వ

ఎడమ కాలువ తూము వద్ద బుంగ..

అప్రమత్తమైన అధికారులు

ఇసుక బస్తాలతో తాత్కాలిక రక్షణ..

కట్ట భద్రతపై రైతుల్లో ఆందోళన

కోనరావుపేట రూరల్, ప్రభాతవార్త: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు కళకళలాడుతోంది. గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో నీరు చేరని ప్రాజెక్టు ఈసారి వరద ప్రవాహాలతో వేగంగా నిండుతుండటంతో రైతుల్లో ఆనందం నెలకొంది. అయితే మరోవైపు ప్రాజెక్టు కట్టలో తలెత్తిన లోపం ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు జలాశయం నిండుతుండగా, మరోవైపు ఎడమ కాలువ తూము వద్ద బుంగ ఏర్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 19 అడుగులు కాగా, ఇప్పటికే 15 అడుగుల వరకు నీరు చేరింది. ఎగువ ప్రాంతాలైన సిరికొండ, చీమనపల్లి, తాటిపల్లి, గర్జనపల్లి, వన్‌పల్లి గ్రామాల పరిసరాల్లో భారీ వర్షాలు కురవడంతో వరద ప్రవాహం నిరంతరంగా ప్రాజెక్టులోకి చేరుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొద్ది గంటల్లో లేదా ఒకటి, రెండు రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

నిండితే అలుగు దుంకే పరిస్థితి

ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితే అలుగు ద్వారా భారీగా నీరు దిగువ ప్రాంతాలకు విడుదల కానుంది. దీంతో వట్టిమల్ల, బావుసాయిపేట, మామిడిపల్లి గ్రామాల సమీపంలో మూలవాగు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వాగు పరివాహక ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

కట్టలో బుంగ... పెరుగుతున్న ఆందోళన

జలాశయంలో నీటి మట్టం పెరుగుతున్న తరుణంలోనే ప్రాజెక్టు ఎడమ కాలువ తూము లోపలి భాగంలో బుంగ ఏర్పడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. బుంగ కారణంగా కట్ట లోపలి నుంచి నీరు ఒత్తిడితో బయటకు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. నీటి ఒత్తిడి మరింత పెరిగితే పరిస్థితి క్లిష్టంగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ విషయాన్ని గుర్తించిన నీటిపారుదల శాఖ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఇసుక బస్తాలను వేసి తాత్కాలికంగా నీటి లీకేజీని అడ్డుకునే చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఇది శాశ్వత పరిష్కారం కాదని, కట్టకు అత్యవసర మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

రైతుల్లో ఆనందంతో పాటు ఆందోళన

ప్రాజెక్టు నిండితే ఖరీఫ్, రబీ పంటలకు సమృద్ధిగా సాగునీరు లభిస్తుందన్న ఆశ రైతుల్లో కనిపిస్తోంది. కానీ కట్ట భద్రతపై నెలకొన్న అనుమానాలు వారిని కలవరపెడుతున్నాయి. ఎక్కడైనా కట్టకు నష్టం జరిగితే దిగువ గ్రామాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు నిరంతర పర్యవేక్షణ

ప్రాజెక్టు పరిస్థితిని నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నీటి మట్టం, కట్ట స్థితి, తూము వద్ద పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో 24 గంటలపాటు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు సమాచారం.

రైతుల డిమాండ్

మూలవాగు ప్రాజెక్టు మండలంలోని వేల ఎకరాలకు ప్రధాన సాగునీటి వనరు కావడంతో కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టి బలోపేతం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వర్షాకాలం ముగిసిన వెంటనే సాంకేతిక నిపుణులతో సమగ్ర పరిశీలన నిర్వహించి కట్టను పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



దసరా నాటికి డిపో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి బస్సు డిపో నిర్మాణ పనుల ముమ్మర పరిశీలన

గత పాలకుల నిరక్ష్యం వల్లనే పెద్దపల్లికి బస్సు డిపో దూరమైంది

నూతన ఆర్టీసీ డిపోతో మెరుగైన ప్రాంతీయ రవాణా సౌకర్యాలు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

దసరా నాటికి పెద్దపల్లి ఆర్టీసీ బస్సు డిపో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని, నిర్మాణ నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పెద్దపల్లి ప్రజల చిరకాల కల అయిన ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణాన్ని దసరా పండుగ నాటికి పూర్తి చేసి ప్రారంభించేలా పనులు త్వరత్వరగా జరగాలని ఎండీ నాగిరెడ్డి సంబంధిత అధికారులకు మరియు కాంట్రాక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లలో మొదటి నుండి పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ గా ఉన్నప్పటికీ, మిగతా చోట్ల బస్సు డిపోలు ఉండి పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో



డిపో లేకపోవడం అత్యంత సిగ్గుచేటని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపోను మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశానని గుర్తుచేశారు. పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలపై ఉన్న ప్రత్యేక మమకారంతో ముఖ్యమంత్రి డిసెంబర్ 2024 మాసంలో పెద్దపల్లికి విచ్చేసి యువ వికాసం బహిరంగ సభ సాక్షిగా బస్సు డిపోను మంజూరు చేశారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గ ప్రజలకు నూతన బస్సు డిపోను అందుబాటులోకి తెచ్చి రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, ఆర్టీసీ ఈడీ సోలమన్, పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్ రెడ్డి, ఆరఎం బి.రాజు, గోదావరిఖని డీఎం కవిత, మున్సిపల్ కౌన్సిలర్లు మొలుమూరి కమల్, కొమ్ము సుధాకర్, సుధా మల్ల అమ్రేష్, ఎంఏ నదీమ్, ఆర్టీసీ అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి కళాశాలలో అంబరాన్నంటిన బోనాలు, గోరింట సంబరాలు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు

నిర్వహించిన వైనంతెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు, గోరింటాకు వేడుకలు

సాంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం బోనాలు, గోరింట సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ అల్లెంకి రజిని శ్రీనివాస్ హాజరై బోనం ఎత్తుకొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా రజిని శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో బోనాల పండుగ అత్యంత ప్రాచీన వైభవోపేతమైన జానపద పండుగ అని తెలిపారు. అమ్మవారికి అన్నం, పెరుగు, బెల్లం, ఇతర నైవేద్యాలతో కూడిన బోనం సమర్పించి భక్తిని చాటుకోవడం, మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి తలపై బోనం ఎత్తుకొని



ఊరేగింపుగా వెళ్లడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఆషాడమాసంలో మహిళలు అందంగా చేతులకు గోరింటాకు అలంకరించుకోవడం సంస్కృతిలో భాగమైన అందమైన సాంప్రదాయమని తెలిపారు. గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అందించడమే కాకుండా జీవితాల్లో సంతోషాన్ని నింపుతుందన్నారు. విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు స్వయంగా గోరింటాకు రుబ్బి చేతులకు పెట్టుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోలీసుల చాకచక్యానికి నిదర్శనం.. గంటల్లోనే బాలికల ఆచూకీ..

సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో బాలికల జాడ

12 గంటల్లోనే ఇద్దరు బాలికల రక్షణ.. డీసీపీ అభినందనలు



సుల్తానాబాద్, ప్రభాతవార్త: సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో గల బాలసదన్ చిల్డ్రన్ హోమ్ నుంచి తప్పిపోయిన ఇద్దరు మైనర్ బాలికలను పోలీసులు కేవలం 12 గంటల్లోనే సురక్షితంగా గుర్తించి రక్షించారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగించి బాలికల ప్రయాణ మార్గాన్ని గుర్తించిన పోలీసులు విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేశారు. బుధవారం తెల్లవారుజామున బాలికలు హాస్టల్ ప్రాంగణంలోని కాంపౌండ్ గోడ దూకి వెళ్లిపోయిన విషయం తెలిసిన వెంటనే పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక బృందాన్ని పెద్దపల్లికి, మరొకదాన్ని కరీంనగర్‌కు, ఇంకొకదాన్ని స్థానిక సమాచార సేకరణకు, మరో బృందాన్ని బాలికల్లో ఒకరి బంధువుల గ్రామమైన పాలితం ప్రాంతానికి పంపించి గాలింపు చర్యలు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ప్రయాణ వివరాలను విశ్లేషించగా బాలికలు సుల్తానాబాద్ చౌరస్తా నుంచి ఆటోలో పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుని, అక్కడి నుంచి రైలులో భువనగిరికి, అనంతరం బస్సులో నల్గొండకు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే నల్గొండ బస్టాండ్‌లో వారిని సురక్షితంగా గుర్తించి రక్షించి, అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు.ఈ ఆపరేషన్‌లో సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు, ఎస్‌హెచ్‌ఓ చంద్రకుమార్, హెడ్ కానిస్టేబుల్ మహేందర్, కానిస్టేబుళ్లు వెంకటేష్, రవి, రమేష్, అరుణ్, సదానందం, రేణుకతో పాటు టెక్నికల్ టీమ్ సభ్యులు సమన్వయంతో పనిచేసి బాలికలను వేగంగా గుర్తించడంలో కీలక పాత్ర పోషించారు.ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సీఐ, ఎస్‌హెచ్‌ఓ, పోలీసు సిబ్బంది, టెక్నికల్ టీమ్‌ను డీసీపీ రామ్ రెడ్డి అభినందించారు. సమన్వయంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం వల్లే బాలికలను తక్కువ సమయంలో సురక్షితంగా గుర్తించడం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలో పోలీసులు చూపిన అప్రమత్తత, వేగవంతమైన చర్యలను ప్రజలు, ప్రజాప్రతినిధులు, చైల్డ్ వెల్ఫేర్ శాఖ అధికారులు ప్రశంసించారు.

నేరాలు-దారుణాలు

బైక్ దొంగతనం కేసు ఛేదన

పాత నేరస్థుడి అరెస్ట్

చీకురాయి చౌరస్తా వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడిన దొంగ



పెద్దపల్లి, ప్రభాతవార్త: పెద్దపల్లి బస్ స్టాండ్ వద్ద పార్క్ చేసిన బైక్ దొంగతనానికి గురైన కేసును పోలీసులు ఛేదించారు. జూన్ 20న భరత్ నగర్‌కు చెందిన మామిడిపల్లి ప్రదీప్ తన హెచ్ ఎఫ్ డీలక్స్ బైక్ (నంబర్ టి ఎస్ 22 డి 7969) ను పెద్దపల్లి బస్ స్టాండ్ సమీపంలో పార్క్ చేసి వెళ్లగా, రాత్రి వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు, నమ్మదగిన సమాచారంతో జూలై 29న చీకురాయి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడైన జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజక్కపల్లికి చెందిన రంగు గంగాధర్ దొంగిలించిన బైక్‌తో సహా పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి సిఐ కొండపాక ప్రవీణ్ కుమార్ గంగాధర్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. విచారణలో నిందితుడిపై గతంలో దాదాపు 9 కేసులు ఉన్నట్లు తేలిందని తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన ఎస్ ఐ కే. నరేష్, కానిస్టేబుళ్లు ప్రభాకర్, సతీష్‌లను పెద్దపల్లి సీఐ కొండపాక ప్రవీణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

అనారోగ్య కారణాలతో వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

కరీంనగర్ రూరల్ మండలం, నల్లగుంటపల్లి గ్రామానికి చెందిన అట్ల అనిత(24) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి 5 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అనారోగ్య కారణాలతో ఏడాది క్రితం భర్తతో విడాకులు కావడంతో, అప్పటి నుంచి నల్లగుంటపల్లి గ్రామంలోని తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. అనారోగ్యంతో మానసికంగా కృంగిపోయిన అనిత ఈ నెల 29న సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి అట్ల మల్లయ్య పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్

పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ కే నరేష్

101.26 గ్రాముల ఎండు గంజాయి, స్మార్ట్ ఫోన్ స్వాధీనం

పెద్దపల్లి, ప్రభాతవార్త:

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ కే నరేష్ తెలిపారు. పెద్దపల్లి ముదామి వీధికి చెందిన సయ్యద్ సఫియుద్దిన్ అలియాస్ దావుద్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. సయ్యద్ సఫియుద్దిన్ 2024 లో రామగిరి మండలంలోని వైన్స్ లో దొంగతనం చేశాడు. ఆ తర్వాత భువనగిరి, పెద్దపల్లి రైల్వే కాలనీలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం ఆటో నడుపుతూ జీవిస్తున్న సయ్యద్ సఫియుద్దిన్ కి వచ్చే ఆదాయం సరిపోక గంజాయి అమ్మడం ప్రారంభించాడు. గత 3 నెలల నుండి కార్తీక్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి పెద్దపల్లి ప్రాంతంలో ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. గురువారం ఉదయం 11.15 గంటలకు పెద్దపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో మిగిలిన గంజాయి అమ్ముతుండగా సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్న తమను చూసి పారిపోతున్న సయ్యద్ సఫియుద్దిన్ ను పట్టుకున్నామని తెలిపారు. నిందితుడి వద్ద నుండి 5000 రూపాయల విలువైన 101.26 గ్రాముల ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేసిన కార్తీక్ పరారీలో ఉన్నాడని, సయ్యద్ సఫియుద్దిన్ ను రిమాండ్ కోసం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని తెలిపారు.

వీర్లపల్లిలో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భరోసా

గోదావరిఖని, ప్రభాతవార్త: భారీ వర్షాల కారణంగా ఆర్ఎఫ్‌సీఎల్ పహరీ గోడ కూలిపోవడంతో వీర్లపల్లి గ్రామంలోకి వరద నీరు చేరి పలు ఇళ్లు జలమయమైన నేపథ్యంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గురువారం గ్రామంలో పర్యటించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు.వరద బాధిత కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం వారి వెన్నంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.పర్యటనలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మీ పథకంపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్లలో 114 మందికి కల్యాణలక్ష్మీ

షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ



కోరుట్ల, ప్రభాతవార్త : కల్యాణలక్ష్మీ పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అప్పు చేసి ఆడపిల్ల పెళ్లి చేస్తున్న నిరుపేద కుటుంబాలు డబ్బుల కోసం సంవత్సరం కాలం ఎదురు చూడాల్సిన దుస్థితి వచ్చిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. గురువారం పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల, పరిసర గ్రామాలకు చెందిన లబ్ధిదారులు 114 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణ లక్ష్మీ, షాదీముభారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మీ, షాదీ ముభారక్ పథకాలు నిరుపేదలకు ఆశించిన స్థాయిలో అసరాగా నిలువడం లేదన్నారు. ఆయా పథకాల ద్వారా డబ్బులు వస్తాయన్న ధైర్యంతో అప్పు చేసి ఆడ పడుచు పెళ్లి చేస్తున్న నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ అసమర్థత కారణంగా నెలలు గడిచిన డబ్బులు మంజూరు కావడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు ఠంచన్గా చెక్కులు అందించేవారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో నిధుల కొరత, దరఖాస్తుల పరిశీలనలో జాప్యంతో పెళ్లి జరిగి ఏడాది గడిచిన చాల మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కావడం లేదని పేర్కొన్నారు. కొందరు జంటలకు పిల్లలు పుట్టిన తర్వాత కూడ కల్యాణ లక్ష్మీ అందని పరిస్థితులు నెలకొన్నాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మళ్లీ అధికార పగ్గాలు చేపట్టేలా ప్రజలు దీవించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, నాయకులు మోసిన్, కాశిరెడ్డి మోహన్ రెడ్డి, మహ్మద్ అతిక్, ఎలుగూరి కిరణ్, రాజశేఖర్, గంగాధర్, శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

కల్లూరు-సర్వరాజుపల్లి మధ్య లెవెల్ బ్రిడ్జిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :





భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామం నుండి సర్వరాజుపల్లి గ్రామం మధ్యనున్న లెవెల్ బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం, రాకపోకల పరిస్థితి, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ లెవెల్ బ్రిడ్జిలను దాటేందుకు ప్రయత్నించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమిషనర్, ఎంపిడివో రామకృష్ణ తో పాటు రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జలమయమైన లోతట్టు ప్రాంతాల సందర్శన

మున్సిపల్ చైర్ పర్సన్

తిరుమల వసంత గంగాధర్ కమిషనర్ రాఘవేంద్ర



కోరుట్ల, ప్రభాతవార్త : కోరుట్ల పట్టణంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి కురుస్తున్న భారీ వర్షాలు ఈదురుగాలులు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి జనజీవనం పూర్తిగా దెబ్బతింది పలు వార్డులలో నీరు ఇండ్లలోకి చేరి ప్రజలు నాన్న ఇబ్బందులు పడుతుండగా గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కమిషనర్ రాఘవేంద్ర తో కలిసి పలు వార్డులను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. అనంతరం వారు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించ కూడదని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారాన్ని అందించాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇంట్ల నుంచి బయటకు వెళ్లకూడదని సూచించారు ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ దాసరి సునీత రాజశేఖర్, 2వ వార్డు కౌన్సిలర్ హుమేరా కౌసర్ వాసిదు, 21వ వార్డు కౌన్సిలర్ షహనాజ్ సుల్తానా రిజ్వాన్, 4వ వార్డు తెడ్డు శ్రీజ విజయ్, ఎడ్ల జలజ రమేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్, నాయకులు రంగు సత్యనారాయణ, చిట్టి మిల్లి రంజిత్ కుమార్ గుప్తా, ప్రశాంత్, తాళ్లపల్లి మనోజ్, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు,పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు

కౌన్సిల్ సాధారణ సమావేశం

కోరుట్ల, ప్రభాతవార్త :

కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ వసంత తిరుమల అధ్యక్షతన ఈరోజు కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగినది. సమావేశంలో పొందు పరచిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపినారు. సమావేశంలో పట్టణములోని అన్ని వార్డుల లో మురికి కాలువలు శుభ్రం చేయుటకు తగు చర్యలు తీసుకోవల్సిందిగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని వార్డు సభ్యులందరు కోరారు. అనంతరం చైర్ పర్సన్, సభ్యులందరూ ప్రస్తుత వర్షాకాల దృష్ట్యా అన్ని వార్డులలో మురికి కాలువలు శుభ్రం చేయాలని, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ సిబ్బందినీ ఆదేశించారు. ఈ సమావేశంలో గౌరవ మున్సిపల్ వైస్ చైర్మన్ , కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర, డిప్యూటీ డిఇ అరుణ్, మేనేజర్ శ్రీనివాస్,టీపీవో , జె ఏ ఓ, ఆర్ ఓ, ఎస్సై, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కోరుట్ల వార్త



కోరుట్ల రెండో రోజు కురిసిన భారీ వర్షం

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలో రెండో రోజు సైతం భారీ వర్షం కురిసింది. బుధ వారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు తక్కువ వర్షపాతం నమోదై నప్పటికీ గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కుర వడంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. గోవింద గిరి కాలనీ ముత్యాల వాడ ప్రకాశం రోడ్డు ఏరియాలో లోతట్టు ప్రాంతాల్లో వరద రాగా పట్టణంలోని మద్దుల చెరువు మత్తడి దూకింది. పూల్ వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తుంది. రాత్రి సైతం భారీ వర్షం ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మండలంలోని ఐలాపూర్ గ్రామంలో భారీ వర్షపాతం నమోదు కాగా కల్లూరు గ్రామ శివారులో గల వాగు నుంచి నీరు ప్రవహించడంతో కోరుట్ల నుంచి రాయికల్ కు రాకపోకలు స్తంభించిపోయాయి. గత మూడు రోజుల నుంచి ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షంతో కొరత పట్టణంలోని చెరువుల్లో జల కల సంతరించుకోగా అటు ప్రజలు ఇటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరద ప్రాంతాలను సందర్శించిన బిజెపి నాయకులు

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కోరుట్ల లోని లోతట్టు ప్రాంతాలైన 10,11 వార్డులు, ముత్యాల వాడ, ఆదర్శ నగర్ ప్రాంతాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, డా. అనూప్ రావు,పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఆరోగ్యశాఖ విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు వెళ్లకుండా,వరద నీరు ప్రవహిస్తున్న రోడ్లు, వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయవద్దని,విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు నీటితో నిండిన ప్రాంతాలకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వారివెంట జిల్లా కార్యదర్శి సుధవేణి మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, మ్యాకల గణేష్, గాందె నవీన్, కార్యదర్శి బాల్క ప్రేమ్ సాగర్ బీజేవైఎం ప్రెసిడెంట్ దమ్మ సంతోష్. ఐటీ సెల్ ఇంచార్జ్ రాగంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో వేగవంతమైన చర్యలు

-46వ వార్డులో ప్రమాదకర మట్టి గోడ తొలగింపు
-సమిండ్ల వాణి శ్రీనివాస్ మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త

జగిత్యాల పట్టణంలోని 46వ వార్డులో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాత మట్టి గోడ ప్రమాదకరంగా మారి స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నట్లు, అలాగే ఒక ఇంటి పైకప్పు దెబ్బతిన్నట్లు స్థానిక కౌన్సిలర్ అనీస్ ఖతీజా (అహ్మద్) మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సమిండ్ల వాణి శ్రీనివాస్ గారి దృష్టికి తీసుకువచ్చారు.విషయం తెలుసుకున్న వెంటనే మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సమిండ్ల వాణి శ్రీనివాస్ గారు మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ గారు, మున్సిపల్ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న పాత మట్టి గోడను జేసీబీ సహాయంతో వెంటనే తొలగించి ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టారు.అనంతరం వర్షాల కారణంగా ఇంటి పైకప్పు దెబ్బతిన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అందించాల్సిన సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ,



వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత గోడలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, నీటి నిల్వలు లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జగిత్యాల మున్సిపాలిటీకి సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు జగిత్యాల మున్సిపాలిటీ టోల్ ఫ్రీ నంబర్ - 7330653331 కు సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రతే మున్సిపాలిటీ ప్రథమ ప్రాధాన్యత అని, సమస్యల పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, స్థానిక కౌన్సిలర్ అనీస్ ఖతీజా (అహ్మద్), టీపీబీఓ శ్రీకర్ మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షాల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్
జేసీబీలు, సానిటేషన్ సిబ్బందితో ముమ్మర శుభ్రత పనులు

సుల్తానాబాద్, ప్రభాతవార్త:

గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సుల్తానాబాద్ పురపాలక సంఘం అప్రమత్తమైంది. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ పట్టణంలోని 1, 4, 7, 15వ వార్డుల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జేసీబీలతో కాల్వలను శుభ్రం చేయించడంతో పాటు సానిటేషన్ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టించారు. వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా



అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ పర్యటనలో మున్సిపల్ కౌన్సిలర్లు వరప్రదీప్ ఊట్ల, ఈర్ల స్వరూప, గాదాసు మంజుల, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలున్నా వృద్ధులపై ఆగని వేధింపులు

భాధితులకు అండగా తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:



పిల్లలను కని పెంచి, వారిని ప్రయోజకులుగా ఎదగడానికి సర్వశక్తుల్ని దారబోసిన తల్లి దండ్రులు ను జీవిత చరమాంఖంలో ఆ పిల్లలే వారిని అవమానిస్తూ, నిత్యం వేధింపులకు గురించేస్తున్నారు. ఈ వేధింపులకు కులం, మతం, ధనిక, బీద తేడా లేకుండా పోయింది..వృద్ధుల సంక్షేమ చట్టం 2007, ఇటీవల మన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల తల్లి దండ్రుల పోషణ చట్టం 2026 అమలులో ఉన్నా ఉమ్మడి జిల్లాలో పలువురు వారి తల్లి దండ్రులను పోషించడం లేదు.తల్లి దండ్రులును పోషించడం అనేది పౌరానిక కాలం నుంచి మన భారత సంస్కృతి లో సహజంగా వస్తున్న దర్మం. కానీ నేటి కాలంలో ఆ ధర్మాన్ని గుర్తు చేయడానికి జగిత్యాల జిల్లా కేంద్రం లో 2016 లో రిటైర్డ్ రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారి పి. నర్సింహా రావు ఆధ్వర్యంలో హైదరాబాద్ లో ఏర్పాటు అయిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కు అనుబంధం గా జగిత్యాల జిల్లా కేంద్రం లో 2016 లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్. ఏర్పాటు కాగా పలు రకాలు గా నిరాధరణ కు శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్న వృద్ధ తల్లి దండ్రులు తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. ఈ బృందం ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేసిన సర్వేలో 35 శాతం ఆస్తుల కోసం, 30 శాతం పోషణ కోసం,, 25 శాతం వైద్య ఖర్చు ల కోసం, 10 శాతం ఇతర కారణాల కోసం వృద్ధులపై వేధింపులు జరుగుతున్నట్లు తేలింది.గత ఏడాది ఉమ్మడి లో 69 మంది వృద్ధులు ఆత్మ హత్యలకు పాల్పడ్డారు. అనారోగ్యం కారణంగానే అని పోలీసుల రికార్డ్ ద్వారా తెలుస్తుండగా చాలా మంది వారి పిల్లలు పట్టించుకోకపోవడం తోనే ఆత్మ హత్యలకు పాల్పడ్డారని చెబుతున్నారు.

భారీ వర్షాలతో నిండుతున్న కుంటలు,చెరువులు

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆయా గ్రామాలలో ఉన్న చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లు తున్నాయి. జనజీవనం స్తంభించింది. హుస్సేన్ మియ్య వాగు పొంగి పొర్లడంతో ఆవాగు పరివాహక ప్రాంతం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల నుండి సూపర్ ఎలినోవా ప్రభావం వల్ల వర్షాలు కురకపోవడంతో హుస్సేన్ మియా వాగు వెలవెల పోవడంతో వాగు పరివాహక ప్రాంత రైతులు వర్షాకాలం పంటలు పండుతాయో లేవని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.గత మూడు రోజుల నుంచి వర్షాల ప్రభావంతో వాగు పొంగిపొర్లడంతో వర్షాకాలం పంటలు పండుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఏది ఏమైనా గత మూడు రోజుల నుంచి వర్షాలు కురవడంతో మండల రైతులు ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

37 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు

ఆర్జీ1 పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి సన్మానం

గోదావరిఖని,ప్రభాత వార్త:సింగరేణి రామగుండం ఆర్జీ1 ఏరియాలో పర్సనల్ మేనేజర్‌గా సుదీర్ఘకాలం పాటు సేవలందించి ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్న ముప్పిడి రవీందర్ రెడ్డికి బుధవారం బంగ్లోస్ ఏరియాలోని ఇల్లంద్ క్లబ్‌లో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఏరియా అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయనను ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జీ1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి రవీందర్ రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 37 ఏళ్ల ఉద్యోగ జీవితంలో రవీందర్ రెడ్డి కార్మిక సంక్షేమం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, మానవ వనరుల నిర్వహణలో విశేష సేవలు అందించారని కొనియాడారు. ప్రతి ఉద్యోగి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరించే తత్వం ఆయన ప్రత్యేకత అని, సింగరేణి సంస్థకు ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.



భారీ వర్షాలతో నిలిచిన విద్యుత్ సరఫరా

-తక్షణ చర్యలతో పునరుద్ధరణకు కృషి చేసిన సర్పంచ్



ఓదెల,ప్రభాతవార్త:రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఓదెల మండలం హరిపురం గ్రామంలో గురువారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో తాడిచెట్టు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ స్తంభాలు దెబ్బతిని గ్రామంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ విద్యుత్ శాఖ ఏడీ రవీందర్, ఓదెల ఏఈ మోహన్ నాయక్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మరమ్మతు పనులు ప్రారంభించారువిద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరించే వరకు సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ సంఘటన స్థలంలోనే ఉండి విద్యుత్ శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. దీంతో పనులు వేగంగా కొనసాగి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.గ్రామ ప్రజల సమస్యను వెంటనే గుర్తించి, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేస్తూ విద్యుత్ సరఫరా త్వరగా పునరుద్ధరించేందుకు కృషి చేసిన సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్‌కు గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, లైన్ ఇన్‌స్పెక్టర్ సదానందం, వార్డు సభ్యులు ఆసరి మహేందర్, బేరం రాజయ్య, మాకోటి ఓదెలు, ముప్పు రాకేష్, తుమ్మల లక్ష్మయ్య, తోట్ల హరీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి 15 గేట్లు ఎత్తి నీటి విడుదల

అంతర్గాం, ప్రభాత వార్త :



అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ సమీపాన గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 15 గేట్లు ఎత్తి అధికారులు దిగువన గల గోదావరి లోకి నీటిని విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎల్లంపల్లి లోకి భారీగా వరద నీరు పోటేత్తుతుంది. ప్రాజెక్ట్ కు ఎగువన గల కడెం ప్రాజెక్ట్ నుండి 156279 క్యూసెక్కుల, సమీపంలోని వాగులు, కుంటల ద్వారా 199975 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 20.1754 గాను ప్రస్తుతం 19.3419 టీ. ఎం. సి. లకు చేరుకొని నిండు కుండను తలపిస్తుంది.ఇంకా ఎగువ నుండి వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ప్రాజెక్ట్ లోని 15 గేట్లు ఎత్తి 155625 క్యూసెక్కుల నీరు దిగువన గల గోదావరి లోనికి, హైద్రాబాద్ మెట్రో తాగునీటి అవసరాల కోసం 275 క్యూసెక్కులు, నంది పంపు హౌస్ నుండి 15750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ వద్ద ఎల్లంపల్లి అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని సమీక్షిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గోదావరి తీర ప్రాంతానికి పశువుల కాపరులు, మత్స కారులు, ఎవరూ వెళ్ళవద్దని హెచ్చరిక లు జారీచేసి అధికారుల ద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులే పర్యావరణ పరిరక్షణకు ఆదర్శం

మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య

సుల్తానాబాద్,ప్రభాతవార్త: ఉపాధ్యాయులే పర్యావరణ పరిరక్షణలో ముందుండి ఆదర్శంగా నిలవాలని మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ గర్రెపల్లిలో నిర్వహిస్తున్న మూడు రోజుల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ ప్లేట్లను వినియోగిస్తూ పర్యావరణ హిత సందేశాన్ని ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఆచరించే మంచి అలవాట్లను విద్యార్థులు, తల్లిదండ్రులు అనుసరిస్తారని, అందువల్ల పునర్వినియోగ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. చిన్న చిన్న మార్పులే భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిస్తాయని తెలిపారు.

మెట్‌పల్లి డివిజన్‌లో భారీ వర్షాల బీభత్సం

పొంగిపొర్లుతున్న వాగులు, ఓర్రెలు

నిండిన చెరువులు, కుంటలు

చావిడి వద్ద కూలిన పాత ఇల్లు

లోతట్టు ప్రాంతాలు జలమయం

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

అప్రమత్తంగా ఉండాలని ప్రజాప్రతినిధుల సూచన



(ప్రభాతవార్త - మెట్‌పల్లి డివిజన్) మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల్లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఎడతెరిపిలేని వర్షాలకు వాగులు, ఓర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. మెట్‌పల్లి పట్టణంలోని 15 వ వార్డు చావిడి వద్ద భారీ వర్షాల కారణంగా ఓ పాత ఇల్లు కూలిపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి కూలిన పాత ఇల్లు మట్టి పేల్లలను జెసిబి సాయం తో తొలగించారు. పలుచోట్ల చెట్లు విరిగి రహదారులపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని 14 వ వార్డు లో వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కౌన్సిలర్ దొనికెలా శిరీష నవీన్ స్వయంగా సహాయక చర్యలో పాల్గొన్నారు. ప్రధాన డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడంతో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి వాటిని తొలగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కౌన్సిలర్లు తమ పరిధిలోని ప్రాంతాలను పరిశీలిస్తూ బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా వ్యాపారులు సాయంత్రం వేళ కూడా దుకాణాలు తెరవలేని పరిస్థితి నెలకొంది. రవాణా వ్యవస్థ కూడా పలు ప్రాంతాల్లో స్తంభించిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, వాగులు, ఓర్రెలను దాటే ప్రయత్నం చేయవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు లు గురువారం నియోజకవర్గ ప్రజలకు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త : భారీ వర్షాల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అశోక్ కుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. వాగులో ప్రవాహ పరిస్థితులను పరిశీలించిన అనంతరం ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాల కారణంగా వాగులు, వంకల్లో ప్రవాహం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, నది ప్రవాహ ప్రాంతాలను చూసేందుకు ప్రజలు వెళ్లవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ పరిశీలనలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రవాహం దాటలేక పోయిన వాచ్ మెన్

కారులో దాటించి నమల్లాపూర్ సర్పంచ్

మల్లాపూర్ ప్రభాతవార్త మల్లాపూర్ మోడల్ స్కూల్ లో వాచ్ మెన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న సత్యనారాయణ అనే వ్యక్తి మోడల్ స్కూల్ వాచ్మెన్ పనిచేస్తున్నాడు. కాగా మోడల్ స్కూల్ నుండి నుండి మల్లాపూర్ గ్రామం లోకి వచ్చే సమయం లో అతి భారీ వర్షాల కారణం గా రోడ్డు పై భారీ ప్రవాహం చేత రోడ్డు దాటలేక భయం తో వణికిపోతున్న విషయం మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ కు తెలియడం తో పాలకవర్గం తో హుటాహుటిన అతి భారీ వర్షం లెక్కచేయకుండా వెళ్ళి వాచ్ మెన్ ను రోడ్డు దాటించి సర్పంచ్ లక్ష్మణ్ తన కారు లో గ్రామం కు తరలించారు. ఈ సంఘటన మల్లాపూర్ లో తెలియడం తో గ్రామస్థులు మల్లాపూర్ పాలక వర్గం ను అభినందించారు. ఈ



కార్యక్రమం లో ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి, వార్డు సభ్యులు ముష్కరి రమేష్, అల్లె చంద్రయ్య,ముత్యాల గంగా రాజం, మహమ్మద్ షబ్బీర్,శనిగారపు నరేష్,భుక్యా శేఖర్,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శితిలావస్థలో ఉన్న ఇళ్ల నుండి ప్రజలను తరలింపు

మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త: భారీ వర్షాలు కురుస్తున్నందున మండలం లోని వెల్లుల్ల గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల నుండి ప్రజలను గురువారం తాత్కాల్నికగా ప్రభుత్వ పాఠశాలకు తరలించినట్లు సర్పంచ్ గూడూరు తిరుపతి పేర్కొన్నారు. ఈసందర్భంగా పూర్తిగా దెబ్బతిన్న నాలుగు ఇండ్లల్లో నివసిస్తున్న వారిని వెంటనే ఇంటి నుంచి ఖాళీ చేయించి



ప్రభుత్వ పాఠశాలలో వారికి వసతి సౌకర్యం కల్పించి అవసరమయ్యే నిత్యవసరాలను కల్పించే విధంగా గ్రామ పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేయడం జరిగింది. అలాగే పెద్ద చెరువు తూము ద్వారా నీటి లేకేజి కి ఇసుక సంచులు వేసి అడ్డుకట్ట వేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్,జేపీఓ నాగరాజి,కార్యదర్శి నారాయణ, వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి వార్త

డ్రైనేజీ మరమ్మతులు చేయించాలని జువ్వాడికి వినతి

మెట్పల్లి అర్బన్, ప్రభాతవార్త:



పట్టణంలోని గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి 21వ వార్డు, దుబ్బవాడలో సి.ఎం.ఎస్. గోదాం సమీపంలో వద్ద ఉన్న డ్రైనేజ్ కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటి డ్రైనేజీ సమస్యను పరిష్కరించలని గురువారం కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు దృష్టికి యూత్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్ తీసుకెళ్లగా తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు, మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ లకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ యూత్ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్ మాట్లాడుతూ..వర్షపు నీరు మురికి కాలువలోకి వెళ్లక రోడ్డుపై నిల్వ ఉండడం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ముఖ్యంగా వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందనీ కాంగ్రెస్ పార్టీ జువ్వాడి నర్సింగరావు కు తెలిపిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించలని అధికారులను ఆదేశించినందుకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, 21 వ వర్డ్ సభ్యులు నర్సింగ్ రావ్ కు ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరిన పట్టణ మైనారిటీ మాజీ అధ్యక్షులు ముఖిమ్

మెట్పల్లి అర్బన్ ,ప్రభాతవార్త:



తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరిన మైనారిటీ పట్టణ మాజీ అధ్యక్షులు మహమ్మద్ ముఖిమ్ శుక్రవారం రాత్రి కోరుట్ల రక్షణ సేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రఘు ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ చీప్ కల్వకుంట్ల కవిత పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ముఖిమ్ మాట్లాడుతూ... కవిత ఆధ్వర్యంలో పంచ జన్య సూత్రాలను పాటిస్తూ టీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసి రాష్ట్రంలో అధికారంలోకి తెస్తామని తెలిపారు. ముఖిమ్ పాటు పట్టణలోని 50 మంది కార్యకర్తలతో పార్టీలో చేరారు.

భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ నీత.

మెట్‌పల్లి రూరల్,ప్రభాతవార్త: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నీత అన్నారు. మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో పెద్దవాగు, పెద్ద చెరువు తూము నుండి వచ్చే నీటి ప్రాంతాలను తహసీల్దార్ నీత గురువారం పరిశీలించారు. అలాగే గ్రామంలో శితిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న వారి ఇంటికి వెళ్లి,ముందు జాగ్రత్తగా ఇళ్ళు ఖాలీ చేయాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ సంధ్యా రాణి, సర్పంచ్ చిట్యాల రాజారామ్,ఉప సర్పంచ్ కసాడి తిరుపతి,కార్యదర్శి మహేష్,జిపివో రాజేష్, వార్డు సభ్యుడు కార్తీక్, తదితరులు ఉన్నారు.

సిరిసిల్ల వార్త

సూపర్ ఎల్ నినోపై అప్రమత్తం చేయాలి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్ , వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు.సూపర్ ఎల్ నినోపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు.జిల్లా ఎల్ నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు . ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా వివరించాలని పేర్కొన్నారు. వాటికి కావలసిన అన్ని విత్తనాలు అందుబాటులో పెట్టాలని సూచించారు .



అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్స్ రీచార్జ్ పనులు, పామ్ పాండ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా చేయించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జీవనజ్యోతి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు,కలుషిత నీటి వల్ల టైఫాయిడ్, విరేచనాలు,వైరల్ జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసి వినియోగించాలని తెలిపారు.ఆహారాన్ని పరిశుభ్రంగా తయారు చేసి వేడి వేడిగా తీసుకోవాలని,బయట ఆహారాన్ని వీలైనంత వరకు నివారించాలని సూచించారు.దోమల నివారణకు దోమతెరలు ఉపయోగించడంతో పాటు పూర్తి చేతుల దుస్తులు ధరించాలని పేర్కొన్నారు. చిన్నపిల్లలు,వృద్ధులు,గర్భిణీలు ఆరోగ్య విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.జ్వరం,వాంతులు,విరేచనాలు,ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు.గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం,చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం,డ్రైనేజీలను శుభ్రంగా ఉంచడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని వైద్యాధికారులు తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

కాత్యాయని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలంలోని అనంతారం గ్రామంలో సిరిసిల్లకు చెందిన కాత్యాయని ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో స్థానిక సర్పంచ్ ఒల్లాల రజితవెంకటేశం పాల్గొని ప్రారంభించారు.గ్రామ ప్రజలకు కంటి సంబంధిత వ్యాధులపై వైద్యులు పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు అందించారు.మొత్తం 150 మంది రోగులకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని సర్పంచ్ తెలిపారు.శిబిరాన్ని విజయవంతం చేసిన కాత్యాయని ఆసుపత్రి వైద్య బృందానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు సింగ్,లత, శ్రీనివాస్,గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసిల్దార్ కార్యాలయంలో అత్యవసర నియంత్రణ గది ఏర్పాటు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు తహసిల్దార్ కార్యాలయంలో అత్యవసర నియంత్రణ గదిని ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ రాచకట్ల సురేష్ తెలిపారు.వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా ప్రజలు వెంటనే నియంత్రణ గదికి సమాచారం అందించాలని సూచించారు.గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.చెరువులు,వాగులు,కాలువల వద్దకు అవసరం లేకుండా వెళ్లరాదని హెచ్చరించారు.విద్యుత్ స్తంభాలు,తెగిపోయిన విద్యుత్ తీగల సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అధికారులు,గ్రామస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.ఏదైనా ప్రమాదకర పరిస్థితి కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా హెల్ప్ లైన్ నంబర్ 9963782919 కు కాల్ చేయాలనీ తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

మళ్లీ రాకపోకలు నిలిచేనా

కోతకు గురవుతున్న లింగన్నపేట తాత్కాలిక రోడ్డు

గంభీరావుపేట, ప్రభాతవార్త:



అధికారుల నిరక్ష్యం కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్యం చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. గంభీరావుపేట మండల ప్రజలకు మళ్లీ తిప్పలు తప్పేటట్లు లేదు. లింగన్నపేట వాగు పై వేసిన తాత్కాలిక రోడ్డు వర్షపు దాటికి కోతకు గురవుతుంది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలకు వారధి అయిన తాత్కాలిక రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుంది. రూ. 10 కోట్లతో నిర్మించ తలపెట్టిన హై లెవెల్ బ్రిడ్జి మూడేళ్లుగా పూర్తి కావడం లేదు. ప్రతి ఏటా వచ్చిన వరద నీటికి తాత్కాలికంగా వేసిన రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకపోతుంది. దీంతో దారి గుండా మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రతి ఏటా భారీ వర్షాలు కురిసి ఎగువ మానేరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. తద్వారా వచ్చిన వరద ఉధృతికి లింగన్నపేట వాగు పొంగి ప్రవహించి తాత్కాలికంగా వేసిన రోడ్డు నామరూపాలు లేకుండా పోతుంది. నెలలపాటు ప్రాంతం గుండా రాకపోకలు నిలిచిపోయి ప్రాంత ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. వరదలు ముగిసి నీటి ప్రభావం తగ్గాక మళ్ళీ తాత్కాలిక రోడ్డు వేస్తున్నారు. అప్పటివరకు సిద్దిపేట నుండి గంభీరావుపేట మీదుగా కామారెడ్డి వెళ్లాల్సిన బస్సులు మట్టా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వాగు అవతలి గ్రామాల ప్రజలు సైతం మండల కేంద్రానికి రావడానికి అవస్థలు పడాల్సిన పరిస్థితి. వర్షాలు ఇలాగే కురిసి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోతే మళ్లీ తాత్కాలిక రోడ్డుకు ఎన్ని నెలలో నిరీక్షించాల్సిందోనని ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

సిరిసిల్ల పెద్ద బజార్ లో నేల కూలిన భారీ వృక్షం

సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త :

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సిరిసిల్ల పట్టణంలోని పెద్ద బజార్ లో భారీ వృక్షం రోడ్డుపై కూలిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టుతో పాటు హైటెన్షన్ విద్యుత్ వైర్లు కూడా తెగిపడి రోడ్డుపై పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో పార్కింగ్ చేసిన ఓమ్ని వ్యాన్ ధ్వంసమయ్యాయి. వ్యాన్ నడుపుతున్న వ్యక్తి గాయపడగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ, మున్సిపల్ సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తెగిపడిన విద్యుత్ వైర్ల కారణంగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి, చెట్టును తొలగించారు.. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ సూచించారు.గురువారం ఆయన మాట్లాడుతూ వాగులు,వంకలు,చెరువుల వద్దకు అవసరం లేకుండా వెళ్లవద్దన్నారు.ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నీటిని దాటే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు.వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పిడుగులు పడే అవకాశం ఉన్న సమయంలో చెట్ల కింద నిలవకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.విద్యుత్ తీగలు తెగి కనిపిస్తే వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై అశోక్ విజ్ఞప్తి చేశారు.



రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులకు విపత్తు నిర్వహణ శిక్షణ

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, అగ్నిప్రమాదాలు తదితర అత్యవసర సమయాల్లో ప్రజలను రక్షించేందుకు పోలీసు సిబ్బందిని సన్నద్ధం చేసే లక్ష్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పదిహేడవ బెటాలియన్, తెలంగాణ స్పెషల్ పోలీస్ ప్రాంగణంలో మూడు రోజుల విపత్తు నిర్వహణ శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది.విపత్తుల వేళ తక్షణ స్పందన ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లు, రిజర్వ్ కేంద్రం నుంచి ఎంపికైన 31 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. ఈ నెల జూలై 30 నుండి ఆగస్టు 1, 2026 వరకు మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.పదిహేడవ బెటాలియన్ సహాయ కమాండెంట్లు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బండి శ్రీనివాస్ మరియు శిక్షణ బృందం. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించడం తాడుల సహాయంతో రక్షణ చర్యలు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించడంఆధునిక విపత్తు నిర్వహణ పద్ధతులుఈ శిక్షణ ద్వారా పోలీసు సిబ్బంది మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి, అత్యవసర వేళల్లో ప్రజలకు మెరుగైన రక్షణ సేవలు అందించగలరని అధికారులు తెలిపారు.

బీర్పూర్ మండలంలో జలగండం

నిరక్ష్యాల రోల్ల వాగు తూములా.. పొంగే వాగులా?
పూర్తికాని షట్టర్ పనులు..
నీటిబొట్టు నిలవదు.. ఊళ్లకు ఊళ్లే దిగ్బంధం!
జలదిగ్బంధంలో చర్లపల్లి గ్రామం
భయం గుప్పిట్లో బీర్పూర్ మండల ప్రజలు..

బీర్ పూర్ ప్రభాత వార్త

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర అలజడి సృష్టిస్తున్నాయి. ఒకవైపు అధికారులు, ప్రాజెక్టు నిర్వాహకుల నిరక్ష్యం వల్ల భారీగా నీరు వృథాగా పోతుంటే, మరోవైపు సరైన ముందస్తు చర్యలు లేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఖిఏ నిమిషానికి ఏం జరుగుతుందోఖి అని ప్రజలు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నారు.

రోళ్లవాగు ప్రాజెక్ట్ నిండు కుండలా అంబరం

నిరక్ష్యానికి నీటి ధారలు!జగిత్యాల జిల్లాలో బీర్పూర్ మండలంలోనే అతిపెద్ద నీటి వనరు అయిన రోళ్లవాగు ప్రాజెక్ట్ వర్షపు నీటితో కలకలలాడుతోంది. కానీ, తీరా చూస్తే పరిస్థితి దారుణం. ప్రాజెక్టు తూములకు షట్టర్లు (తలుపులు) ఏర్పాటు చేయకపోవడంతో సెటర్లు ఏర్పాటు చేయడానికి పని జరుగుతున్న సమయంలోని వర్షాలు కురవడంతో ఏకటిగా వచ్చిన వరద నీరు వచ్చినట్లే వృథాగా బయటకు పోతోంది.

వృథాగా పోతున్న సంపద


ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసే అవకాశం ఉన్నప్పటికీ, అధికారుల నిరక్ష్యం వల్ల చుక్క నీరు నిలవకుండా కిందకు కొట్టుకుపోతోంది.భవిష్యత్తులో సాగునీటికి పనికొచ్చే ప్రాజెక్టు నీరు కళ్లముందే వృథాగా పోతుంటే బీర్పూర్ మండల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జలదిగ్బంధంలో ఖిచర్లపల్లి

: అత్యవసర సాయం అందేదెలా?వరద ఉధృతికి బీర్పూర్ మండలంలోని చర్లపల్లి గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. గ్రామానికి ఇరువైపులా ఉన్న వాగులు పొంగిపొర్లుతుండటంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.భయానక పరిస్థితులు: అత్యవసర వైద్య సాయం కావలసి వచ్చినా లేదా ఎలాంటి ఆపద వచ్చినా బయటకు వెళ్లే దారి లేక చర్లపల్లి ప్రజలు అల్లాడిపోతున్నారు. సర్పంచులు, స్థానిక నాయకులు నిరంతరం అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పగుళ్లు బారిన తుంగూరు పెద్ద వాగు బ్రిడ్జి:

ఎప్పుడు కూలుతుందోనన్న భయం!తుంగూరు నుండి కండ్లపల్లి వెళ్లే మార్గంలో ఉన్న పెద్ద వాగు బ్రిడ్జి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది.గతంలో వరదలకు దెబ్బతిన్న ఈ బ్రిడ్జి, ప్రస్తుత వరద ధాటికి కింద భాగంలో పగుళ్లు బారి, ముందు వైపు ఉన్న మట్టి పూర్తిగా కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిపోయిందని ఆ గ్రామంలో



సర్పంచుతున్నారు. ప్రమాదాన్ని గ్రహించిన తుంగూరు, కండ్లపల్లి గ్రామాల సర్పంచులు అప్రమత్తమై బ్రిడ్జిపై రాకపోకలను తక్షణమే నిలిపివేశారు. పెద్ద ప్రమాదం జరగక ముందే అధికారులు ఈ బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించి ఈ బ్రిడ్జికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామాల్లో సర్పంచుల పహారా

మండలంలోని మొత్తం 28 చెరువులు, కుంటలు నిండుకుండలా మారి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు రాత్రింబవళ్లు పహారా కాస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి యంత్రాంగం మరియు విపత్తు నిర్వహణ బృందాల మద్దతు తక్షణమే అవసరం.

తక్షణమే చేపట్టాల్సిన చర్యలు (ప్రభుత్వానికి విజ్ఞప్తి):

రోళ్లవాగుకు తలుపులు

రోళ్లవాగు ప్రాజెక్టు తూములకు షట్టర్లు ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేస్తే ప్రస్తుతం ఈ పరిస్థితి ఉండేది కాదని వరద క్రిందికి వచ్చేది కాదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతానికి తాత్కాలికంగా తూము దగ్గర వరదను అదుపు చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని తూము గుండా వరద ఉధృతిని అదుపులోకి తీసుకురావడానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మండలంలోని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే జలదిగ్బంధంలో ఉన్న చర్లపల్లి గ్రామానికి బోట్లు లేదా ప్రత్యేక రక్షణ బృందాలను అందుబాటులో ఉంచాలి. జలదిగ్బంధంలో ఉన్న గ్రామంపై ప్రత్యేక సిద్ధ కనపరిచి ఎటువంటి సమస్య ఎదురు కాకముందే ఏ ప్రమాదం జరగకముందే అధికారులు ముందస్తులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.తుంగూరు పెద్ద వాగు బ్రిడ్జి స్థానంలో తాత్కాలిక పునరుద్ధరణ పనులు చేపట్టి, భవిష్యత్తులో శాశ్వత వంతెన నిర్మించాలి.మండలంలోని 28 చెరువుల ను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి ప్రమాదకరంగా వాటి స్థాయికి మించి ప్రవహిస్తున్నా చెరువులను వాటి పరిస్థితిని అంచనా వేసి ఎటువంటి గండి పడకుండా అయా గ్రామాలలో ప్రజలకు ఎటువంటి నష్టం వాటి లేకుండా ఎటువంటి ప్రమాదం జరగకుండా నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలనీ మండలంలోని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని అధికారులను కోరుచున్నారు.

రెడ్ అలర్ట్ నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

రాబోయే 48 గంటల పాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా లోని ప్రజలు అందరూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు.గురువారం ఉదయం భారీ వర్షాల పరిస్థితి, ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు లో పర్యటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని , అత్యవసర పరిస్థితుల్లో ఏదైనా ఘటన జరిగినా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.అన్ని శాఖల అధికారులు రెడ్ అలర్ట్ నేపథ్యంలో



తదుపరి 48 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ అందుబాటులో ఉంటారని, గ్రామ సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు తదితర స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సామీల వాణి జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో మరియు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఎస్.ఐలు నర్సింగరావు,అలీముద్దీన్‌లకు

ఎస్పీ శుభాకాంక్షలు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా గొల్లపల్లి, కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐలు గా విధులు నిర్వహించి ఎస్.ఐలు గా పదోన్నతి పొందిన నర్సింగరావు, అలీముద్దీన్ లు జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని అన్నారు. పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం, గౌరవం మరింత పెరిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.



జగిత్యాల వార్త



బాధిత కుటుంబానికి పరిహారం,డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు అందించాలి

దావ వసంత సురేష్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ పోరండ్ల గ్రామానికి చెందిన సింగరపు రవి ఇల్లు బుధవారం రోజున భారీగా కురుస్తున్న వర్షానికి కూలిపోగా,విషయం తెలుసుకున్న జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన రవికి ధైర్యం చెప్పి,ప్రభుత్వం నుండి రావలసిన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ఈ విషయమై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి,బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా వెంటనే పరిహారం అందించడంతో పాటు వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంగారెడ్డి,తోట మహేష్, శేఖర్,మల్లేశం గౌడ్,లింగయ్య,సన్నీత్,చందు, రాము తదితరులు పాల్గొన్నారు.

డా. విశారదన్ మహారాజ్ అరెస్టును ఖండిస్తూ నేడు జగిత్యాల బంద్‌కు జేఏసీ పిలుపు

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డా. విశారదన్ మహారాజ్‌ను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ జగిత్యాల జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ శుక్రవారం జిల్లా బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల అర్బన్ కాల నీలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అనేక ప్రదాన సమస్యలు ఉండగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు విన్న మించిన పరిష్కారం కాకపోవడంతో విశారధాన్ మహారాజు మా భూమి రథయాత్రలో భాగంగా జగిత్యాల అర్బన్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించి ఆందోళనలో పాల్గొన్న ప్రజలను చెదరగొట్టడం విశారద మహారాజును అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని జేఏసీ నాయకులు విమర్శించారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం నేరమా అని ప్రశ్నించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు.డా. విశారదన్ మహారాజ్ అరెస్టుకు నిరసనగా జగిత్యాల జిల్లా బంద్‌ను శాంతియుతంగా నిర్వహించాలని జిల్లా ప్రజలకు జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు, ప్రజాసంఘాలు సహకరించాలని కోరింది. ఈ ఉద్యమానికి ఎలాంటి రాజకీయ రంగు లేదని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో , జిల్లా జేఏసీ అధ్యక్షుడు మానాల కిషన్, డీఎస్పీ అధ్యక్షుడు దుబ్బాక శివ మహారాజ్, జేఏసీ ప్రధాన కార్యదర్శి పడాల శ్రీనివాస్, మోడబోయిన రాజారాం ముదిరాజ్, చేనని అనిల్, ఉపేంద్ర, కోటేష్, దూడ తిరుపతి, గంగరాజన్, అశోక్, ప్రణీత్ బాబు, ప్రవీణ్, తిరుపతి, నరేష్, జానీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు

వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి...

జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు....

అనుమతి లేకుండా అధికారులు సెలవులో వెళ్ళరాదు....

కలెక్టర్ చిత్రా మిశ్రా..

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:


రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, జిల్లాలోనూ వర్షాలు ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.పాత, శిథిలావస్థలో ఉన్న భవనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట్ల జేసీబీలు, రెస్క్యూ వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. వదులుగా ఉన్న విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లను ఏఈలతో సమన్వయం చేసుకుని నిరంతరం పర్యవేక్షి ంచాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 8782997247ను ప్రజలకు, ప్రజాప్రతినిధులకు విస్తృతంగా తెలియజేయాలనీ పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఈ నంబర్‌కు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్యాధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోతో సమన్వయం చేసుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షి ంచాలని అన్నారు. రహదారులకు జరిగిన నష్టంపై పంచాయతీరాజ్ అధికారులు వెంటనే నివేదిక అందించాలని తెలిపారు. ఆర్‌అండ్‌బీ రహదారులు, కల్వర్టులు, వంతెనలు ఇతర మోలిక సదుపాయాలకు జరిగిన నష్టంపై రోడ్లు భవనాల శాఖ అధికారులు నివేదిక సమర్పించాలన్నారు. పంట నష్టాలను నమోదు చేయాలని, అలాగే పశుసంవర్ధక శాఖ సిబ్బందితో కలిసి అవసరమైన చోట పశువుల రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పశుస ంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. వర్షం కారణంగా ప్రమాదక రంగా పారుతున్న నీటి కాలువల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, నీటి ప్రవాహానికి సంబంధించిన ప్రమాదకర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షి ంచాలని ఆదేశించారు మండల స్థాయి అధికారులు ఎవరూ ముందస్తు అనుమతి లేకుండా సెలవులో వెళ్ళరాదని, అందరూ తప్పనిసరిగా వారు పని చేస్తున్న హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని ఆదేశిం చారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లను ప్రత్యేకంగా పర్యవేక్షి స్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

కాంగ్రెస్ చేనేత సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా బండారి సదానందం

-- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన బండారి సదానందం కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. చేనేత సెల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ ఈ మేరకు ఆయనకు నియామక బాధ్యతలు అప్పగించారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి, రాష్ట్ర నాయకత్వానికి సదానందం ధన్యవాదాలు తెలిపారు. ఈ నియామకం



అనంతరం కరీంనగర్‌లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బండారి సదానందం మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించిన మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు సదానందాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... జిల్లాలో కాంగ్రెస్ పార్టీతో పాటు చేనేత సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం, చేనేత వర్గాల అభివృద్ధి కోసం ఎలాంటి అవసరం వచ్చినా తాను పూర్తిగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే, హుజూరాబాద్ నియోజకవర్గంలో స్థానిక నాయకుడు ప్రణవ్ సహకారంతో సమన్వయంగా ముందుకు వెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాజీపేట శ్రీనివాస్, బీసీ నాయకులు కన్నెబోయిన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సేవకు దక్కిన గుర్తింపు..

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి సంపత్ గౌడ్ ఘనంగా సన్మానం చేపట్టిన కాంగ్రెస్ నేతలు

మానకొండూర్, ప్రభాతవార్త :

మానకొండూర్ నియోజకవర్గం లోని శంకరపట్నం, మానకొండూరు, తిమ్మాపూర్ మండలాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మానకొండూర్ మండల పరిధిలోని గంగిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ , కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్ నియమితులయ్యారు. గత 20 యేళ్లుగా తాళ్లపల్లి సంపత్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం చేసిన సేవలను అధిష్టానం గుర్తించి నూతనంగా మూడు మండలాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకం పట్ల మండల కాంగ్రెస్ నేతలు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానం చేపట్టి శుభాకాంక్షలు తెలిపారు. 20 యేళ్లుగా కాంగ్రెస్ పార్టీ పార్టీలో సేవలందిస్తూ మండల ప్రధాన కార్యదర్శిగా, బీసీ సెల్ మండల అధ్యక్షుడు , యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీగా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారని, అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ అధికారం లో లేక పోవడంతో సీనియర్ నేతలు, ప్రజా ప్రతినిధులు చాలామంది నాయకులు పార్టీని వీడి తన స్వార్థం కోసం వెళ్లిపోయారని, మండలంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైతున్న తరుణంలో తాళ్ల పెల్లి సంపత్ గౌడ్ పార్టీని వీడకుండా పదేళ్లపాటు మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కాంగ్రెస్ జెండా పట్టుకొని పార్టీ నాయకులతో కలిసి ఊరూరా తిరుగుతూ ప్రజలను చైతన్య పరుస్తూ ఎంతో సేవలందించారని ఆయన సేవకు పార్టీ అధిష్టానం గుర్తించి బ్లాక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్ర చారి, మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సంపత్ గౌడ్ ను సన్మానం చేపట్టి శుభాకాంక్షలు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, నాయకులకు సంపత్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై పార్టీ బాధ్యతలు అప్పగించిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు, బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని సంపత్ గౌడ్ అన్నారు.



మొక్కను బ్రతికించండి ప్రాణ కోటికి వాయువు అందించండి...

-- మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని...

హుజూరాబాద్ టౌన్, ప్రభాత వార్త:

ప్రాణ కోటికి జీవనాధారం మొక్క అని అలాంటి మొక్కను బ్రతికించి ప్రజలకు ప్రాణవాయువు పోయాలని హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని పిలుపునిచ్చారు. గురువారం హుజూరాబాద్ మున్సిపల్ వార్డుల్లో ఇంటింటికి మొక్కలు స్థానిక కౌన్సిలర్లతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ, గ్రామాన పట్టణాల్లో ఘనంగా నిర్వహిస్తుందని, ప్రస్తుతం ఎల్ నీనో లాంటి విపత్తులను తట్టుకోలవాలి అంటే మొక్కలు పెంచి వాటిని వృక్షాలుగా మలిచి ప్రకృతికి సహాయం చేయాలని తద్వారా రైతులకు, జీవనాధారానికి ప్రాణ వాయువు పోసిన వాళ్ళం అవుతామని అన్నారు. ఇప్పటి నుండి హుజూరాబాద్ పట్టణ పరిధిలోని ప్రతి ఒక్కరు ఇంటికి ఒక మొక్కను పెంచి ప్రకృతికి సహకరించాలని, ప్రతీ మనిషి ఒక మొక్కను నాటి ప్రజలకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కరీంనగర్ వార్త

అల్ఫోర్స్ లో ఎన్సీసీ రిపబ్లిక్ డే పరేడ్ డే...

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్‌లో ఎన్సీసీ రిపబ్లిక్ డే పరేడ్ డే క్యాంపు ఘనంగా గురువారం జరిగింది. ఎన్సీసీ అధికారులతో కలిసి నిర్వహించిన ఈ ఎంపిక పరీక్ష సందర్భంగా పాఠశాల నిర్వాహకులు క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్సీసీలో చేరిన ప్రతి విద్యార్థి కేవలం సర్టిఫికెట్ కోసమే కాకుండా క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి, సేవాస్ఫూర్తి వంటి అమూల్యమైన జీవిత విలువలను నేర్చుకుని ఆచరిస్తారని చెప్పారు. కర్తవ్య పథ్‌పై అడుగులు వేయడం ప్రతి ఎన్సీసీ క్యాడెట్‌కు జీవితంలో అత్యున్నత జాతీయ గౌరవమని, దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది క్యాడెట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కొద్దిమందికే ఈ అరుదైన అవకాశం లభిస్తుందని గుర్తు చేశారు. క్రమశిక్షణ, పరేడ్ నైపుణ్యం, శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వం వంటి అంశాల్లో ప్రతిభను నిరూపించుకున్న వారినే ఎంపిక చేస్తారని తెలిపారు. రాష్ట్ర, గ్రూప్, డైరెక్టరేట్ స్థాయి కఠినమైన ఎంపిక శిబిరాలను విజయవంతంగా పూర్తి చేసిన క్యాడెట్లే ఢిల్లీకి ఎంపికవుతారని స్పష్టం చేస్తూ, విద్యార్థులంతా ఎన్సీసీ అధికారులు తెలిపిన విధివిధానాలను పాటించి అర్హత సాధించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డికి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణమూర్తి, ఆదిలాబాద్‌కు చెందిన హవిల్దార్ దేవేంద్ర సింగ్, సుబేదార్ జంగ్ బాజ్ ఖాన్, సునీల్ కుమార్, నిజామాబాద్ సుబేదార్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరీంనగర్ లో సిటీ బస్సులుప్రారంభం...

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, కరీంనగర్ రిజియన్ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలో సిటీ బస్సులు గురువారం ప్రారంభమయ్యాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్, కరీంనగర్ ఆవరణలో రాష్ట్ర రవాణా బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీస్ కమిషనర్ గౌస్, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ లు సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ బస్సులు కరీంనగర్ నుండి వాగ్దేవి కళాశాల, చింతకుంట, కొత్తపల్లి (హవేలి) రూట్లలో నడుస్తాయన్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ చేసిన సర్పంచ్

మానకొండూర్, ప్రభాతవార్త :

మానకొండూరు మండలంలో రంగపేట గ్రామ సర్పంచ్ కుమారుడు అజిత్ రెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సర్పంచ్ రామ్ రెడ్డి రజిత దంపతులు స్కూల్ బ్యాగ్స్ అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ కొమురయ్య యాదవ్, మండల కాంగ్రెస్ నేతలు గుడాల మహేందర్, రేవల్లి రాజలింగం, ఆర్ఎ ంపి మురళి, కొత్త సత్యనా రాయణ రెడ్డి, మర్రి శ్రీనివాస్ రెడ్డి, మర్రి సంపత్ రెడ్డి, కొత్త శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సూర్య, అశోక్, అంగన్వాడి టీచర్ మంజుల, పాఠశాల ఉపాధ్యాయురాలు గ్రామస్తులు పాల్గొన్నారు.



అల్పపీడన హెచ్చరిక.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:

సీఐ నవీన్ యాదవ్

కమలాపూర్: ప్రభాత వార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న 23 రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కమలాపూర్ సీఐ నవీన్ యాదవ్ కోరారు.లోతట్టు ప్రాంతాలు, వాగులు, కుంటలు, చెరువుల సమీపంలో నివసించే కుటుంబాలు



వర్షం కురిసే సమయంలో ఇళ్ల నుండి బయటకు రావద్దని సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట వాహనాలు, పాదచారులు దాటేందుకు ప్రయత్నించవద్దని తెలిపారు. పిల్లలను ఒంటరిగా వాగుల వద్దకు, చెరువుల వద్దకు పంపవద్దని తల్లిదండ్రులకు స్పష్టమైన సూచనలు చేశారు.రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, మోటార్ బావుల వద్ద, పొలాల వద్ద పనిచేసేటప్పుడు విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, మ్యాన్హోల్స్, తెగిపడిన విద్యుత్ తీగల వద్ద ప్రజలు ఎవరూ వెళ్లకుండా చూడాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సీఐ ఆదేశించారు. అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే 100, 101 డయల్ చేయాలని, లేదా స్థానిక పోలీస్ స్టేషన్, రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ సూచనలు పాటించి అందరూ సురక్షితంగా ఉండాలని సీఐ నవీన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

4వ వార్డులో శానిటేషన్ టీమ్ వర్క్ పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా వరద నీరు సజావుగా వెళ్లేందుకు గాను శానిటేషన్ టీమ్ వర్క్



పనులను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ ప్రజలందరూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు రాకూడదని తెలిపారు. వర్షకాలంలో మనం త్రాగే నీరు గోరువెచ్చగా చేసుకొని తాగాలని అలాగే మనచుట్టు ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేకుంటే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పోల్నేని అజయ్ రావు తదితరులు పాల్గొన్నారు.

విలాసాగర్ గ్రామంలో సివిల్ రైట్స్ డే.....

ప్రతి పౌరుడు చట్టాలు, విధులు బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలి.....

తహసిల్దార్ గడ్డం సుధాకర్...

జమ్మికుంట టౌన్ ప్రభాత వార్త:

జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ (శ్రీధర్) అధ్యక్షతన గురువారం సివిల్ రైట్స్ డే గ్రామ సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తహసిల్దార్ గడ్డం సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి పౌరుడు చట్టాలు, విధులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కుల మత వర్గ బేధాలు లేకుండా గ్రామ ప్రజలందరూ సోదర భావంతో కలిసి మెలిసి జీవించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ (శ్రీధర్) తహశీల్దార్ గడ్డం సుధాకర్, ఎస్సై రవి, గిర్దవార్2 ఎన్ సత్యనారాణ, పంచాయతీ కార్యదర్శి,బి. విష్ణు కుమార్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అజాగ్రత్తగా బండి నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

ఆజాగ్రత్తగా బండి నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన పరకాల సాయికుమార్(27) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన చేపూరి మహేష్ అనే వ్యక్తి తన వ్యక్తిగత పనిమీద తన అత్తగారింటికి పరకాల సాయికుమార్ ను సాయికుమార్ యొక్క ద్విచక్ర వాహనంపై తీసుకొని వెళ్ళాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వావిలాల గ్రామ శివారులో గల నగరం చెరువు కట్టపై కిందికి దిగుతున్న సమయంలో అందాజా రాత్రి 7 నుంచి 7:30 గంటల మధ్యలో చేపూరి మహేష్ సాయి కుమార్ యొక్క బండిని అజాగ్రత్తగా అతివేగంగా నడపడం వల్ల అదుపుతప్పి కింద పడిపోగా వెనకాల కూర్చున్న సాయికుమార్ ఎగిరి దూరం పడిపోగా తలకు బలమైన రక్త గాయం అయ్యింది. హైదరాబాద్ లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తమ్ముడు పరకాల వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధగాని రామకృష్ణ గౌడ్ తెలిపారు.

అంటరాని తనం,కులవివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి... ఎస్సై.

వీణవంక, ప్రభాత వార్త:

అంటరాని తనం, కులవివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలనీ స్థానిక ఎస్సై ఆవుల తిరుపతి అన్నారు.గురు వారం వీణవంక



మండలము మళ్ళా రెడ్డి పల్లి గ్రామంలో నీ దళిత కాలనీ లో గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్ పౌరహక్కుల దినోత్సవం జరిగింది.ఈ సందర్భంగా స్థానిక ఎస్సై,రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సయ్య లు కాలనీ అంబేద్కర్ సంఘం సభ్యులు, దళితులతో సమావేశమయ్యారు. ఎస్సీ,ఎస్టీ పై కుల వివక్ష, అంటరాని తనం, ఆలయాల్లో ప్రవేశ నిరాకరణ,హోటళ్లలో రెండు గ్లాస్ ల పద్ధతి నిర్మూలనపై సమావేశమయ్యారు.అనంతరం ఎస్సై మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని,కుల వివక్ష,అంటరానితనం,రెండు గ్లాస్ ల పద్ధతి వంటి సామాజిక దురాచారాలకు సమాజములో ఎలాంటి స్థానం లేదని వివరించారు.గ్రామాల్లో సామాజిక సమానత్వాన్ని పెంపొందించేందుకు ప్రజలందరూ భాగ స్వాములు కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీల పై ఎలాంటి కుల వివక్ష జరిగిన వెంటనే అధికారుల దృష్టికి తీసుక రావాలని సూచించారు.ఈ సమావేశములో గ్రామ కార్యదర్శి సందీప్,జి పి ఓ పురుషోత్తం,ఉప సర్పంచ్ ఆర్షం శ్రీనివాస్, వార్డు సభ్యులు నాని ,శ్రీనివాస్,సుజాత కృష్ణ,వసంత శ్రీనివాస్ లతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతులకు ఆరుతడి పంటల పై అవగాహన కల్పించాలి.....

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి .

వీణవంక , ప్రభాత వార్త:

పవనాలను అడ్డుకొనే ఎలినీనో తో ప్రస్తుతం వర్షపాతం తక్కువ నమోదైనందున,రైతులు నష్టపోకుండా వరి కాకుండా ఆరు తడి పంటలపై గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మచ్చ గీత అన్నారు.గురువారం మండల కేంద్రంలో నీ ఎంపీపీ కార్యాలయ లో ఎంపిడిఓ రవి సుధాకర్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులు,సర్పంచులు ,పంచాయితీ కార్యదర్శులు,గ్రామైక్య సంఘాల తో గ్రామీణాభివృద్ధి అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచుల సహకారము తో జలసిరి కార్యక్రమములో భాగంగ ప్రతి ఊరిలో కుంట,ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలను,పంటపొలాల్లో కట్టలు నిర్మించి భూగర్భ జలాల నీటి మట్టం పెరిగేందుకు అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.రైతులకు తక్కువ కాలములో,తక్కువ నీటి తో పండే పంటలు కంది, మినుములు తదితర పంటల పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని వ్యవసాయ సిబ్బంది నీ ఆదేశించారు.అంతే కాకుండా గ్రామాల్లో మంజూరైన గ్రామైక్య సంఘాల భవన నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్య క్రమంలో మండల తహసిల్దార్ ముద్దసాని రమేష్,వ్యవసాయాధికారి గణేష్,ఎంపీ ఓ ప్రభాకర్,పశువైద్యాధికారి శ్రీకాంత్ సర్పంచ్ లు దాట్ల వీర స్వామి,మండల కుమార స్వామి,బావు సంపత్,కర్ర విజయ,నల్లగొని సరోజన,ఐకేపీ ఏపీఎం సుధాకర్, కార్యదర్శులు,మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ వార్త



కాకతీయ వర్సిటీ ఈసీఈ హెచ్ఓడి గా డాక్టర్ బండ శ్రీకాంత్

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విభాగ హెచ్ఓడిగా హుజురాబాద్ పట్టణానికి చెందిన డాక్టర్ బండ శ్రీకాంత్ నియమితులయ్యారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి గనుల భద్రత పరిశోధనల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. దేశంలోనే అత్యున్నత విద్యాలయమైన ఐఐటి ఖరగ్పూర్ నుండి మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ డిజైన్ లో ఎంటెక్ పూర్తి చేశారు. ఆ పై పరిశోధనలపై ఉన్న ఆసక్తితో ఐఐటి ధన్బాద్ నుండి పిహెచ్డీ పట్టా పొందారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే



సాంకేతికతపై ఆయన కృషి చేశారు. ముఖ్యంగా సింగరేణి, బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల భద్రత కోసం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ సెన్సార్లు ఉపయోగించి రూఫ్ కన్వర్జెన్స్ మోనిటరింగ్ సిస్టమ్ రూప కల్పన చేశారు. గనుల్లో ప్రమాదాలను ముందుగానే గుర్తించి కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చేసిన పరిశోధనలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రశంసలు, పేటెంట్లు, అంతర్జాతీయ రీసెర్చ్ అవార్డులు లభించాయి. 2010 నుండి కొత్తగూడెంలోని కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన డాక్టర్ శ్రీకాంత్, తన సమర్థత, నాయకత్వ లక్షణాలతో వర్సిటీలో కీలక బాధ్యతలను నిర్వర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ... ఒక సాధారణ గ్రామీణ మధ్య తరగతి నేపథ్యం నుండి వచ్చి ఈ స్థాయికి ఎదిగానని, మనం ఎక్కడి నుండి వచ్చామన్నది ముఖ్యం కాదు, మన లక్ష్యం ఎంత పెద్దదన్నదే ముఖ్యం అని, సాంకేతికత వేగంగా మారుతోందని, ఐఓటీ, ఏఐ వంటి ఆధునిక సాంకేతికతల పై అవగాహన పెంచుకుంటూ, సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే పరిశోధనల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని అన్నారు. సాధారణ కుటుంబం నుండి వచ్చి స్వయం కృషితో ఉన్నత శిఖరాలను చేరుకున్న డాక్టర్ బండ శ్రీకాంత్ ప్రయాణం నేటి తరం ఇంజనీరింగ్ విద్యార్థులకు మార్గదర్శకం.

ప్రమాదకర ప్రాంతాలకు ఎవరూ వెళ్లకూడదు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరద ముప్పు పై కమిషనరేట్ పరిధిలోని ప్రజలకు ముందస్తు హెచ్చరికలు



పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు ప్రమాదకర ప్రాంతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదు అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. గురువారం గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రెండు జిల్లాల పరిధిలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేశామని, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ తరఫున అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లకూడదని స్పష్టం చేశారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకరాదని చెప్పారు. చెరువులు, నాలాలు, డ్యామ్‌లు, జలపాతాల వద్దకు చేపల వేట కోసం కూడా వెళ్లకూడదని హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్ అండ్ బి, వైద్య శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న లేదా నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా ఇరువైపులా బ్యారికేడ్లు, ప్లాస్టిక్ కోన్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు, అలుగులు, ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు. వరద నీటి కారణంగా చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు రహదారులు దెబ్బతిని గుంతలు ఏర్పడడం వల్ల నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. కల్వర్టులు, చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలతో వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల కోసం ఎస్‌డీఆరఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారని, పోలీసు సిబ్బంది 24 గంటల పాటు సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటారని వెల్లడించారు.

వర్షాల వల్ల నిలిచిపోయిన కరెంటును వెంటనే పునరుద్ధరించాం

పెద్దకల్వల గ్రామ సర్పంచ్ నర్ల కనకమ్మ పోలురాజు

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:



వర్షాల వల్ల నిలిచిపోయిన కరెంటును వెంటనే పునరుద్ధరించాం అని పెద్దకల్వల గ్రామ సర్పంచ్ నర్ల కనకమ్మ పోలురాజు తెలిపారు. గురువారం పెద్దపల్లి మండలం పెద్ద కల్వల గ్రామంలో భారీ వర్షాల కారణంగా చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో గ్రామంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని గమనించిన సర్పంచ్ వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది సహాయంతో విద్యుత్ స్తంభాలపై విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో వైర్ కనెక్షన్లను సరిచేసి, పునరుద్ధరించి గ్రామానికి విద్యుత్ సరఫరాను పునఃప్రారంభించారు. వర్షాల సమయంలో ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పర్స లక్ష్మిశంకర్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, విద్యుత్ శాఖ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చెరువు మత్తడికి తూము ఏర్పాటు చేయాలని ఈఈకి రైతులు వినతి

జూలపల్లి, ప్రభాతవార్త:

జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామ రైతులు ఇరిగేషన్ శాఖ పెద్దపల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో రైతులు తెలిపిన వివరాల ప్రకారం, ఉర చెరువు (బండోరుకుంట) బ్యాక్‌వాటర్ కారణంగా ప్రతి వర్షాకాలంలో తమ వ్యవసాయ భూములు నీట మునిగి పంటలు దెబ్బతింటున్నాయని, దీంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల కథనం ప్రకారం, గతంలో మత్తడి వద్ద ఒక స్లూయిస్ (తూము) ఉండేదని, అయితే మిషన్ కాకతీయ పనుల సమయంలో అది తొలగించబడిందో లేదా పునరుద్ధరించబడలేదో కావడంతో ప్రస్తుతం అదనపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక బ్యాక్‌వాటర్ సమస్య ఏర్పడుతోందని తెలిపారు. ప్రస్తుతం మత్తడి వద్ద తూము ఏర్పాటు చేస్తే అదనపు నీరు సులభంగా బయటకు వెళ్లి వెంకట్రావుపల్లి రైతుల భూములు రక్షించబడటంతో పాటు దిగువ ప్రాంత రైతులకు కూడా సాగునీరు అందుతుందని వివరించారు. ఈ తూము ఏర్పాటు చేయాలని దిగువ ప్రాంత రైతులు కూడా కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, మత్తడికి తూము ఏర్పాటు చేసి రైతులకు శాశ్వత పరిష్కారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మల్లెత్తుల రాజేందర్, మల్లెత్తుల భూమయ్య, రేచవేని అంజి తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్

పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి సాయిగార్డెన్ వద్ద రహదారిపై పర్యవేక్షణ

వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించి సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య సూచించారు. గురువారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి సాయిగార్డెన్ సమీపంలో రాజీవ్ రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో కమిషనర్ ఆకుల వెంకటేష్‌తో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న పైపులను క్రేన్ సహాయంతో తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో పోలీసులు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పూదరి అనూష మహేందర్, అక్కపల్లి సుజాత క్రాంతి, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, వార్డు అధికారులు, నాయకుడు వునుకొండ రాకేష్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దపల్లి వార్త

వానలో తడుస్తూ.. ప్రజలకు భరోసా!..

శిథిల ఇళ్లను పరిశీలించిన కౌన్సిలర్ సిద్ధ తిరుపతి

అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ప్రజల భద్రత కోసం కౌన్సిలర్ సిద్ధ తిరుపతి వానలోనే క్షేత్రస్థాయిలో పర్యటించారు. వార్డు అధికారి తిరుపతి, మున్సిపల్ సిబ్బందితో కలిసి శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను పరిశీలించి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సిద్ధ తిరుపతి మాట్లాడుతూ, నిరంతర వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పాత భవనాలు, బలహీనమైన గోడలు, ప్రమాదకర నిర్మాణాల సమీపంలో ఎవరూ ఉండవద్దని హెచ్చరించారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చెట్లు కూలిపోవడం, ఇళ్లు దెబ్బతినడం, నీరు నిల్వ ఉండడం వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందిన వెంటనే సమస్యల పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న సిద్ధ తిరుపతి, వర్షాలు పూర్తిగా తగ్గే వరకు ప్రతి ఒక్కరూ అధికారుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ పర్యటనలో వార్డు అధికారి తిరుపతి, కాంగ్రెస్ నాయకుడు వేగోళం కర్ణాకర్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

మండలంలో జలకల

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:

మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఆయా గ్రామాలలో ఉన్న చెరువులు కుంటలు వాగులు పొంగిపొర్లుతున్నాయి జనజీవనం స్తంభించింది తారుపల్లి మీర్జంపేట గ్రామాల మధ్యలో ఉన్న ఓ రై ఉధృతం కావడంతో రెండు గ్రామాల మధ్య ప్రజలకు రాకపోకలు జరగకుండా పోయాయి గంగారం గ్రామ శివారులో ఉన్న హుస్సేన్ మియా వాగు పొంగిపొర్లడంతో ఆ వాగు పరివాహక ప్రాంతం రైతులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు గత రెండు నెలల నుండి సూపర్ ఎలినోవా ప్రభావం వల్ల వర్షాలు కురకపోవడంతో హుస్సేన్ మియా వాగు వెలవెల పోవడంతో వాగు పరివాహక ప్రాంత రైతులు వర్షాకాలం పంటలు పండుతాయో లేవని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు గత మూడు రోజుల నుంచి వర్షాల ప్రభావంతో వాగు పొంగిపొర్లడంతో వర్షాకాలం పంటలు పండుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఏది ఏమైనా గత మూడు రోజుల నుంచి వర్షాలు కురవడంతో మండల రైతులు ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు రైతులు అత్యవసరమైతేనే బయటికి వెళ్లాలని రైతులు తమ మోటార్ల వద్దకు వెళితే విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలని మండల ప్రజా ప్రతినిధులు అధికారులు కోరుతున్నారు



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌస్ అలం

గంగాధర,ప్రభాతవార్త:

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని గంగాధర పోలీస్ స్టేషన్ ను గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపిఎస్ వార్షిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎస్ఐ వంశీకృష్ణ పోలీస్ కమిషనర్ కు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గార్డు అందించిన గౌరవ వందనం స్వీకరించారు పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు పోలీస్ స్టేషన్ లో హాజర్ లో ఉన్న సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించబడిన విదుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరియైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ నమోదైన కేసుల వివరాలు సి సి టి ఎన్ ఎస్ (దిదిగివిళీ) లో పొందుపరచాలని సూచించారు. తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా ఉపయోగించే సీసీటీ ఎన్ ఎస్ 2.0, పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టం లో ఈ సామాన్లు జారీ అమలు టీఎస్ కాప్, హెచ్ ఆర్ ఎమ్మెస్, ఈ సాక్ష్యా, టేక్ డాట్‌వీ, ఐ రాడ్, దర్పన్, సి ఈ ఐ ఆర్, సైబర్ క్రైమ్ లో హార్థిక ఆర్థికేదర నేరాలకు సమాచారం సిడిఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్వేర్ అప్లికేషన్లపై పూర్తిస్థాయిలో పట్టు సాధించి రోజువారి వీధిలో విరివిరిగా వినియోగించా లన్నారు. పోలీస్ స్టేషన్ కి కేటాయించబడిన పరికరాలను పోర్టబుల్ ఫింగర్ ప్రింట్, డివైస్ ను బ్లూ కోర్ట్స్ సిబ్బంది వినియోగించే తీరును పరి శీలించారు. ఎఫ్ఐఆర్ ఇండెక్స్ను పరిశీలించి



పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. కేసుల ఆలస్యానికి గల కారణాలను తెలుసుకొని త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గంగాధర పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్ల హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలు ఎప్పటికప్పుడు గమనించా లన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపి విజయ్ కుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

భారీ వర్షానికి కూలిన ఇల్లు ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే

మల్యాల ,ప్రభాతవార్త



మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన గంగాధర గంగవ్వ అనే నిరుపేద మహిళలకు చెందిన ఇల్లు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు కూలిపోయిన సంఘటన తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం రాత్రి బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ 10 వేల ఆర్థిక సహాయం అందించారు, అంతేకాకుండా భారీ వర్షం వల్ల ఇల్లు కూలిపోయినందున ప్రభుత్వం తరఫున కూడా నష్టపరిహారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు, కార్యక్రమంలో తాటిపల్లి గ్రామ సర్పంచ్ మెట్పల్లి లత, ఉప సర్పంచ్ లక్ష్మణాచారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు అనంద రెడ్డి, ముత్యంపేట, నూక పల్లి సర్పంచులు దారం ఆదిరెడ్డి, చెవులమద్ది శ్రీనివాస్, లంబాడి పల్లి మాజీ ఉపసర్పంచ్ ముత్యాల నరసింహారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల సతీష్ రెడ్డి పాల్గొన్నారు

పెద్ది సుదర్శన్ కోలుకోవాలని కొండగట్టులో మాజీ ఎమ్మెల్యే పూజలు

మల్యాల , ప్రభాతవార్త బిఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని గురువారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి తనకు ఆప్త మిత్రుడని, ఆయన ఆరోగ్యం తొందరగా కుదుటపడాలని శ్రీ స్వామివారిని ప్రార్థించినట్లు మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ తెలిపారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించారు,



కొండగట్టు అంజన్న క్షేత్రంలో జనసేన నాయకుల పూజలు

మల్యాల ,ప్రభాతవార్త రాష్ట్ర ప్రజలు రైతులు పాడిపంటలతో అన్ని రంగాలలో అభివృద్ధి చెంది సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరింత విజయవంతంగా ప్రజాసేవలో ముందుకు సాగాలని కొండగట్టు ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు కోరుతూ గురువారం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు



శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కరీంనగర్ జనసేన నాయకులు శ్రీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం మాట్లా డుతూ, కొండగట్టు లో అభివృద్ధి, భక్తులకు వసతి వంటి ప్రధాన సమస్యలపై మంత్రులు చర్చించకుండా గిరి ప్రదక్షిణ చేశారని, దీంతో స్థానిక ప్రజలు భక్తులు తీవ్ర నిరాశకు గురయ్యారని కరీంనగర్ జనసేన నాయకులు బండారి రాజ్ కుమార్ అన్నారు, కొండగట్టు అభివృద్ధి పై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు, కార్యక్రమంలో జనసేన మహిళ నాయకురాలు సాయి కృష్ణప్రియ, చొప్పదండి జనసేన నాయకులు మొగిలిపాలెం రమేష్, రజిత,శ్రీనాథ్ తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు,

నారాయణ పూర్ లో వర్షాలకు కూలిన ఇళ్లను సందర్శించి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

గంగాధర, ప్రభాతవార్త: గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా అర్ధరాత్రి నుండి ఆరు ఇళ్లు కూలిపోవడంతో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ గురువారం గ్రామాన్ని సందర్శించారు గ్రామంలోని దెబ్బతిన్న ప్రాంతాలను ఆటోలో తిరుగుతూ పరిశీలించి



కూలిపోయిన ప్రతి బాధిత కుటుంబాన్ని స్వయంగా కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు. తక్షణ అవసరాల కోసం ప్రతి కుటుంబానికి రూ.2,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మండల ఎంఆర్ఓ, ఎంపీడీఓ లతో సుంకే రవిశంకర్, మాట్లాడి బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం,ప్రభుత్వ పరంగా పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోని, బాధిత కుటుంబాల వివరాలను సేకరించి నష్టాన్ని అంచనా వేశారు. అలాగే, ఇళ్లు కూలిన కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

చొప్పదండి వార్త



సురక్షితంగా ఉండండి... అవసరమైతేనే బయటకు వెళ్ళండి

చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి



చొప్పదండి,ప్రభాతవార్త: రాష్ట్రంలో భారీగా కురుస్తున్న వర్షాల నేపద్యంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చొప్పదండి ఎస్ఐ నరేష్‌రెడ్డి చొప్పదండి మండల ప్రజలకు పలు సూచనలు చేసారు. భారీ వర్షం, ఉరుములు ఉన్నప్పుడు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర నిలబడవద్దు, రోడ్లపై నీరు నిలిచిన చోట్ల, కాల్వల్లోకి దిగవద్దు, కరెంట్ స్తంభాలు మరియు ఇతర ఇనుప స్తంభాలు ముట్టుకోవద్దు అని కోరారు. వాటి ద్వారా కరెంట్ షాక్ ప్రమాదం ఉండొచ్చు అని, బలహీనమైన ఇళ్లు, గోడలు, హోర్డింగ్‌లకు దూరంగా ఉండాలని, వీలైనంత వరకు అనవసర ప్రయాణాలు వాయిదా వేయండి అని కోరారు. వాహనం నడుపుతున్నప్పుడు నెమ్మదిగా నడపాలని, హెడ్‌లైట్లు వాడండి అన్నారు. వరద నీరు ఉన్న రోడ్ల మీదుగా వెళ్లవద్దు అని కోరారు. వాతావరణ హెచ్చరికలు, ప్రభుత్వ సూచనలను టీవీ, రేడియో, మొబైల్ ద్వారా తెలుసుకుంటూ ఉండండని, ప్రమాదం జరిగితే వెంటనే 100, 108, లేదా స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అధిక వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమిషనర్ నాగరాజు



చొప్పదండి,ప్రభాతవార్త: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చొప్పదండి పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చొప్పదండి మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు కోరారు. ఈ మేరకు ఈ మేరక గురువారం పట్టణంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను గుర్తించి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ తడిసిన కరెంటు స్తంభాలను, స్విచ్ బోర్డులను ముట్టుకోవద్దని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకూడదని, చెట్ల కింద ఉండవద్దని, చెరువుల వద్దకు, నీటి కుంటల వద్ద వెళ్ళవద్దని కోరారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే పట్టణ ప్రజలు తాగాలని కోరారు. నీటిని ఎక్కువ కాలం నిలువ ఉంచకూడదని, దోమలు, ప్రేమ కీటకాలకు దూరంగా ఉండాలని, ఇళ్లలోకి దోమలు చొరకుండా కిటికీలు పెట్టుకోవాలని కోరారు. పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, నీటి తొట్లలో, పూల కుండీలలో నీరు నిలువ ఉండకుండా చూచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల చెరువుకు మంగళ హారతినిచ్చిన ఎమ్మెల్యే సత్యం

మల్యాల, ప్రభాతవార్త మల్యాల మండల కేంద్రంలోని చెరువు వర్షాలకు పూర్తిగా నిండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, ఈ మేరకు గురువారం సాయంత్రం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెరువు వద్దకు వెళ్లి మంగళ హారతులు తో పాటు పట్టు వస్త్రాలను సమర్పించారు, కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోట్ల జయ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్, ఉప సర్పంచ్ కటకం వినయ్, ముత్యంపేట సర్పంచ్ ఆదిరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల సతీష్ రెడ్డి తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,

రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలి

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వరుణ యాగాన్ని ప్రారంభించిన మంత్రులు

మంత్రులకు స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే

వేములవాడ,ప్రభాతవార్త:



రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు.జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ కు చేరుకున్న మంత్రుల కు ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు వర్షాలు కురియాలని , శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించారుఅనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, వరుణయాగం అనేది కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆగమ శాస్త్రానికి అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి పనులు

రాజన్న ఆలయ గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభించిన మంత్రులు

వేములవాడ ,ప్రభాతవార్త:

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో రూ. 12 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ప్రారంభించారు.ఈ సందర్భంగా నటరాజ విగ్రహం, సప్త మాతృకల విగ్రహాలు, గార్డెన్, మొక్కలు, భారీ శివుడి విగ్రహాన్ని వారు పరిశీలించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ రాజన్న ఆలయాన్ని ఆగమ శాస్త్రానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని, ఆలయానికి వచ్చే



భక్తుల ఆహ్లాదం కోసం 12 కోట్లతో గుడి చెరువు బండు పార్కు అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, పుల్కం రాజు ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్ మేడిపల్లి సత్యం కవంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

మల్యాలలో సివిల్ రైట్స్ డే

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండలం మల్యాల గ్రామంలో గురువారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు.రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో అంటరానితనాన్ని ప్రదర్శిస్తే.హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు చేపట్టి, హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మందాల శారద. పంచాయతీ కార్యదర్శి నరేందర్. జిపిఓ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్స కోసం రెండు లక్షల 50 వేలు మంజూరు

చందుర్తి/ ప్రభాతవార్త

చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన గడ్డం అనిల్ కుమార్ వైద్య చికిత్స కోసం రెండు లక్షల 50 వేల ఎల్ వో సిని గురువారం అందజేసినట్లు చందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొట్టే ప్రభాకర్. ఎన్గల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అనిల్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య చికిత్సకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ఈ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసినట్లు గొట్టే ప్రభాకర్ తెలిపారు. అనిల్ కుమార్ వైద్య చికిత్సకు ఆర్థిక సహాయాన్ని అందజేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు. అనిల్ కుమార్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ ఆఫీసా? లేక కొలనా ?

చినుకు పడితే తడిసిపోతున్న తహసీల్దార్ కార్యాలయం





ప్రభాత వార్త కోనరావుపేట ఇది ప్రభుత్వ కార్యాలయమా? లేక వర్షానికి కారే ఇల్లా? అన్న అనుమానం ఎవరికైనా వస్తుంది. కోనరావుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి అలా ఉంది. ఆకాశంలో చినుకు పడితే చాలు... కార్యాలయం పైభాగం నుండి నీళ్లు జలజలా కారుతున్నాయి. ఫైళ్లు తడుస్తున్నాయి అధికారులు చూస్తూనే ఉన్నారు కార్యాలయంలో భూ రికార్డులు, సర్టిఫికెట్లు, ప్రజా ఫిర్యాదులకు సంబంధించిన వేలాది విలువైన ఫైళ్లు ఉన్నాయి. వర్షం వచ్చిన ప్రతిసారీ చ. వాటిని సరిచేసి ఉద్యోగులు ఫైళ్లనుకాపాడుకుంటున్నారు.ప్రజల భూముల రికార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ఫైళ్లు అన్నీ ఇక్కడే ఉంటాయి. ఒకసారి తడిస్తే తిరిగి రావు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదుమరమ్మత్తులో అధికారుల విఫలంఈ సమస్య కొత్తది కాదు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి. పై అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చారు.కానీ మరమ్మత్తు పనులు చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇకనైనా మరమ్మత్తు చేపియాలని మండల ప్రజలు కోరుతున్నారు. తాసిల్దార్ కార్యాలయం మరమ్మత్తు చేపియ్యాలి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏగామంటి ఎల్లారెడ్డి.. గత కొన్నిల్లగా వర్షం కాలం వస్తే చాలు కార్యాలయాల్లోకి నీళ్ల వస్తున్నాయి ప్రభుత్వ కార్యాలయాలు అన్నిటిలోనూ నీళ్ల వస్తున్నాయి తాసిల్దార్ కార్యాలయంలో ముఖ్యమైన భూ రికార్డులు ఉంటాయి కనుక వెంటనే పైకప్పు మరమ్మత్తు చేపియాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు

వేములవాడ వార్త

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్

బోయిన్ పల్లి (ప్రభాత వార్త)



గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు వహించాలని సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ సూచించారు. వర్షాల కారణంగా గ్రామంలో సమస్యాత్మకంగా మారిన పాత ఇళ్లు, విద్యుత్ స్తంభాలను ఆయన స్వయంగా పరిశీలించారు. కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్ళి బాధితుల బాగోగులు అడిగి తెలుసుకుని, వారికి తగిన సలహాలు, సూచనలు అందించారు.వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాల గుండా విద్యుత్ ప్రవహించే ప్రమాదం ఉన్నందున, పిల్లలను కరెంటు స్తంభాల వద్దకు వెళ్లకుండా చూడాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. రాబోయే 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో చెరువులు, కుంటలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు ఎవరూ వెళ్లవద్దని కోరారు. ముఖ్యంగా రైతులు ఎలాంటి విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేయకూడదని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే విద్యుత్ అధికారులకు లేదా సర్పంచ్‌కు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితి అయితేనే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ కోరారు.

వరద ఉధృతి..కొట్టుకుపోయిన వంతెన

-మామిడిపల్లి-నిజాంబాద్ గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల ఉధృతికి వంతెన కొట్టుకపోయింది. కోనరావుపేట మండలం మామిడిపల్లి నిజామాబాద్ గ్రామాల మధ్య మూలవాగుపై ఉన్న తాత్కాలిక వంతెన పూర్తిగా కొట్టుకపోయింది. దీంతో గురువారం రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రానికి వెళ్లేందుకు మామిడిపల్లి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొగ, నిజాంబాద్ గ్రామాల ప్రజలు ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ వెళ్లేందుకు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ప్రతి వర్షాకాలం లో మూలవాగుపై ఉన్న తాత్కాలిక వంతన కొట్టుకపోవడం, రాకపోకలు తెలుసుకోవడం పరిపాటిగా మారింది. పలుమార్లు శాశ్వతం వంతెన నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు పాలకులను అధికారులను కోరుతున్నప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా శాశ్వతమైన వంతెన మూలవాగుపై నిర్మించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మూలవాగు పై వంతెన తెగిపోవడంతో ప్రజలకు అటు వైపు వెళ్లకుండా పోలీసులు వాటర్ ట్యాంక్ ను అడ్డుగా పెట్టారు.

మంథని వార్త

సేవ వైభవ రత్న అవార్డు గ్రహీత ప్రభాకర్‌కు ఘన సన్మానం

రామగిరి ప్రభాతవార్త

లలిత కళాసమాఖ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవ వైభవ రత్న అవార్డుతో పాటు సువర్ణ కంకణం, బంగారు పతకం అందుకోనున్న పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నల్మాసు ప్రభాకర్ ను పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముస్త్యాల శ్రీనివాస్ గురువారం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముస్త్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ, సామాజిక సేవా రంగంలో నల్మాసు ప్రభాకర్ చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక"సేవ వైభవ రత్న" అవార్డు, సువర్ణ కంకణం, బంగారు పతకం లభించడం జిల్లా ఆర్యవైశ్య సమాజానికి గర్వకారమని అన్నారు.భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి



సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య పటేల్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బుద్దార్టి బుచ్చయ్య పటేల్, బర్ల శ్రీనివాస్, రామగిరి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్, రావికంటి సతీష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఇతర సామాజిక వర్గాల వారికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా హైదరాబాద్ కు చెందిన లలిత కళా సమాఖ్య (సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ) వారిచే అత్యున్నతమైన వైశ్య వైభవ రత్న(బిరుదు) అవార్డుతో పాటు సువర్ణ కంకణం బంగారు పథకంతో సత్కరించడానికి ఎంపికైన సందర్భంగా వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నూరు మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి గంద్ర వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుచ్చన్న,యూత్ కాంగ్రెస్ నాయకులు రావికంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నల్మాస్ ప్రభాకర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మంథని ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నల్మాస్ ప్రభాకర్ వైశ్య వైభవ రత్న బిరుదుకు ఎంపికైనందుకు గురువారం మంథని డివిజన్ రామగిరి మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గత 25 సంవత్సరాల నుండి వైశ్య సంఘం ద్వారా, ఇతర వేదికల ద్వారా వైశ్యులకు,

వైశ్య వైభవ రత్న బిరుదుకు ఎంపికైన నల్మాస్ ప్రభాకర్

మంథని ప్రభాతవార్త:ఆర్యవైశ్య మహాసభ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు



నల్మాస్ ప్రభాకర్ వైశ్య వైభవ రత్న బిరుదుకు ఎంపికయ్యారు.లలిత కళా సమాఖ్య (సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ) వారిచే అత్యున్నతమైన వైశ్య వైభవ రత్న(బిరుదు) అవార్డుతో పాటు సువర్ణ కంకణం బంగారు పథకంతో సత్కరించనున్నారు. ఈ అవార్డును ఆగస్టు నెల మొదటి వారంలో ఆయనకు అందజేయనున్నారు. వైశ్య వైభవ్ రత్న బిరుదుకు ఎంపికైన నల్మాస్ ప్రభాకర్ కు పలువురు అభినందనలు తెలిపారు.

కుల వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవు

తాసిల్దార్ పర్నాంది సుమన్

రామగిరి ప్రభాతవార్త:



గ్రామాలలో కుల వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని రామగిరి తాసిల్దార్ పర్నాంది సుమన్ అన్నారు. గురువారం రామగిరి మండలం నాగ పల్లి గ్రామంలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం,నిర్వహించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ సుమన్ తో పాటు ఎస్సై తాడవేణి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించిందని ప్రజలు చట్టాలను గౌరవిస్తూ సామాజిక బాధ్యత వ్యవహరించాలని తెలిపారు. గ్రామాలలో కుల మత బేధం లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలని రెండు గ్లాసుల విధానానికి స్వస్తి పలుకాలని కుల వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ స్వామి, ఉప సర్పంచ్ యాసం సతీష్, పంచాయతీ కార్యదర్శి సప్న, జూనియర్ అసిస్టెంట్లు అనవేన శివకుమార్, ఎస్ నరేష్, ఏఎన్ఎం రాణి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ నోడల్ ఆఫీసర్ గా ఒడ్నాల శ్రీనివాస్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల లోని ఓల్డ్ హై స్కూల్ లో ఫిజికల్ డైరెక్టర్ గా పని చేస్తున్న ఒడ్నాల శ్రీనివాస్ జిల్లా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ నోడల్ ఆఫీసర్ గా ఎంపికైన సందర్భంగా జగిత్యాల శాసన సభ్యులు సంజయ్ కుమార్ అభినందించి నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ అందరిని కలుపుకొని మన జిల్లా క్రీడల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలోరిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ విశ్వప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు క్రిష్ణ ప్రసాద్, లక్ష్మీ రామ్ నాయక్,సాగర్, , భాస్కర్, వేణు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

మాజీ ఎంపిపి, లక్కారం సర్పంచ్ అత్తె చంద్రమోళి

ముత్తారం, ప్రభాతవార్త:



నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా పైప్‌లైన్ కల్వర్టులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల వల్ల రైతుల పొలాలు నీట మునిగాయి. దీంతో తీవ్రంగా నష్టపోయారని, రైతులకు నష్టపరిహారం అందించాలని మాజీ ఎంపిపి, లక్కారం సర్పంచ్ అత్తె చంద్రమోళి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోలేదని, రహదారి నిర్మాణం వల్ల పైన ఉన్న పంట పొలాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైప్‌లైన్ కల్వర్టులను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

నీట మునిగిన పంట పొలాల్లో వరద నీరు తొలగింపు

ముత్తారం, ప్రభాతవార్త:



రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముత్తారం మండలం ఓడేడు, పోతారం, లక్కారం గ్రామాల్లోని పంట పొలాల్లో భారీగా వరద నీరు చేరింది. ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రావు గురువారం నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే అధికారులు చేపడుతున్న రోడ్డు నిర్మాణం వల్ల పంటలు నీట మునిగాయని రైతులు సమాచారం మేరకు ఆయన అక్కడికి చేరుకొని సంబంధిత అధికారులతో మాట్లాడారు. వెంటనే జెసిబిల సహాయంతో కాలువలను తీయించి, పంట పొలాల్లో నిలిచిన వరద నీటిని తొలగింపజేశారు.

ఓడేడులో ఇళ్లలోకి చేరిన వరద నీరు

రక్షణ చర్యలు చేపట్టిన సర్పంచ్

ముత్తారం, ప్రభాతవార్త:



ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో వరద నీరు ఇండ్లలోకి చేరింది. గ్రామానికి చెందిన పోతుగంటి తిరుపతి, దాసరి రమేష్ ఇండ్లలోకి వరద నీరు చేరడంతో వెంటనే వారు గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డికి సమాచారం అందించారు. దీంతో స్పందించిన సర్పంచ్ జెసిబి సహాయంతో వరద నీటిని కాలువ ఏర్పాటు చేయించి, తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బూర్ల రాజేందర్, ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్ పాల్గొన్నారు.

మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రావు



ముత్తారం, ప్రభాతవార్త: ముత్తారం మండలంలోని మానేరు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ మధుసూదన్ రావు ఒక ప్రకటనలో సూచించారు. గత 2, 3 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ నుంచి మానేరులో వరద ఉధృతి పెరిగిందని తెలిపారు. మానేరు పరివాహక ప్రాంతంలో వ్యవసాయ పొలాలున్న రైతులు, మత్స్యకారులు, పశువుల కాపరులు ఎవరూ మానేరు వైపు వెళ్లవద్దని సూచించారు. యువకులు సరదా కోసం కుంటలు, చెరువుల వద్దకు వెళ్లి స్నానాలు చేయడం కోసం అందులో దిగడం ప్రమాదకరమని తెలిపారు. ఎలాంటి అపాయ పరిస్థితులు ఏర్పడిన వెంటనే స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

రోడ్డుపై వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం

పోతారం గ్రామాన్ని సందర్శించిన ఎంపిడిఓ

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలం పోతారం గ్రామ రహదారిపై వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని ముత్తారం ఎంపిడిఓ విజయ్ కుమార్ తెలిపారు. పోతారం గ్రామాన్ని ఎంపిడిఓ గురువారం సందర్శించారు. రహదారిపై వరద నీరు నిలిచిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ వరద ఎక్కడి నుంచి వస్తుందో తెలుసుకున్నారు. వరద నీరు రహదారిపై నిల్వకుండా తగిన చర్యలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊట్ల చరణ్, పంచాయతీ కార్యదర్శి తీగల సతీష్ గౌడ్ గ్రామస్తులున్నారు.

భారీ వర్షాలతో గోదావరి నది ఉధృతం

నీట మునిగిన వంతెనలు.. నిలిచిన రాకపోకలు

ధర్మపురి, ప్రభాతవార్త





ధర్మపురి మండలంలోతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో రెండవ రోజు సైతం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు గోదావరి నది ప్రవాహం ఉధృతంగా మారింది. అలాగే మండలంలోని వివిధ గ్రామాల మధ్య ఉన్న వంతెనలు వాగుల నీటి ప్రవాహంతో మునిగిపోయాయి. అక్షాయి పల్లె వద్ద గల వాగు పొంగి ప్రవహించడంతో ధర్మపురి జగిత్యాల మధ్య రాకపోకలు రెండవ రోజు సైతం నిలిచిపోయాయి. అలాగే ధర్మపురి కమలాపూర్ గ్రామాల మధ్య సైతం రాకపోకలు నుంచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 101.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. భారీ వర్షాలకు పలు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో సంతోషిమాత మెట్లు కొన్ని నీట మునిగాయి. కడెం ప్రాజెక్టు నుండి సుమారు 1.5 లక్షల క్యూసెక్కుల నీటిని గురువారం సాయంత్రం వదలడంతో రాత్రి వరకు గోదావరి నది నీటిమట్టం మరింత పెరగనుంది. ఎలాంటి ప్రాణాష్టం జరగకుండా మున్సిపల్,పోలీస్ ,రెవిన్యూ అధికారులు గోదావరి తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ చేస్తున్నారు. అలాగే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ఆదేశాల మేరకు ధర్మపురి పట్టణంలోని పలు వీధుల్లో పూర్తిగా శిథిలమైన ఇండ్లను ముందు జాగ్రత్త చర్యగా అధికారులు కూల్చివేశారు. ఉదయం నుండి రాత్రి వరకు వర్షం కురవడంతో ప్రజలు తమ ఇండ్లకే పరిమితమయ్యారు.

గొల్లపల్లిలో 82.4 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం

పొంగిపొర్లుతున్న వాగులు.. అప్రమత్తమైన అధికారులు

లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు – చేపల వేటలో గ్రామస్తులు

గొల్లపల్లి, జూలై 30 (ప్రభాతవార్త):



గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో గొల్లపల్లి మండలంలో సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైంది. గురువారం మండలంలో 82.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి.గొల్లపల్లి మండల కేంద్రంలోని చర్చి వాడ, బేస్తపల్లి కాలనీ ల్లో వర్షపు నీరు ఇండ్ల లోకి వెళ్ళటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఎండి మజీద్, ఎంపీడీవో రవీందర్ రావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న,సర్పంచ్ నల్ల నీరజ, ఉపసర్పంచ్ బుచ్చిరెడ్డి వార్డు సభ్యులు సంఘటనా స్థలాలను పరిశీలించి నీరు త్వరగా వెళ్లిపోయేలా చర్యలు చేపట్టారు.మండలంలోని బొంకూర్ గ్రామంలోని లోలెవల్ బ్రిడ్జిపై వరద ఉధృతి పెరగడంతో తహసీల్దార్ ఎం డి మజీద్, ఎం పి డి వో రవీందర్ రావు, ఎస్సై ఎం. కృష్ణసాగర్ రెడ్డి అక్కడ పరిస్థితిని పరిశీలించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ఉధృతి మరింత పెరిగితే వాగు పక్కనే ఉన్న ఎస్సీ కాలనీలోకి నీరు ప్రవేశించే అవకాశం ఉందని తహసీల్దార్ ఎండి మజీద్ హెచ్చరించారు. అవసరమైతే కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండిపోగా, పలుచోట్ల పొలాల మడులపై నుంచి నీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల ప్రజలు వలలతో చెరువులు, వాగుల్లో ,పొలం మడ్ల లో చేపల వేటలో మత్స్యకారులు,ప్రజలు నిమగ్నమై కనిపించారు. అత్యవసరం అయితే తప్ప వరద నీటిలోకి వెళ్లవద్దని, లో లెవల్ బ్రిడ్జిలను దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచించారు.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారీ వర్షాలు, వరద పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోరుట్ల రెవెన్యూ డివిజనల్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు.అధికారులందరూ తమ తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల్లో నమోదైన వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగాన్ని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైనట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు టామ్‌టామ్ నిర్వహించాలని సూచించారు.పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు, పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు. అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వరద ముంపు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, కోరుట్ల ఆర్డీవో జి. వాకర్ రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భారీ వర్షాల నేపథ్యంలో వెంటనే స్పందించేందుకు

మూడు ప్రత్యేక రెస్క్యూ బృందాలు సిద్ధం

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు జగిత్యాల జిల్లా పోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, తెలిపారు. వాగులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ జిల్లా అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన మూడు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.ఈ బృందాలకు లైఫ్ జాకెట్లు, తాళ్లు, రెస్క్యూ కిట్లు, ఇతర ప్రత్యేక భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచామని, వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెంటనే రక్షించడం వంటి చర్యలకు వీటిని వినియోగిస్తామని తెలిపారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు వర్షాల నేపథ్యంలో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, వివత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు పోలీసు బృందాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే పడవలు, ఇతర రక్షణ పరికరాలతో సహాయక చర్యలను మరింత వేగవంతం చేస్తామని వెల్లడించారు.ప్రజలు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని, అధికారుల సూచనలను పాటించాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

అధిక వర్షాలకు ఇల్లు కూలిన బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి

సారంగాపూర్ ప్రభాతవార్త: సారంగాపూర్ మండలంలోని పెంబట్ల, కోనపూర్ గ్రామాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన లోతట్టు ప్రాంతాలను గురువారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిశీలించారు.ఈ సందర్భంగా పెంబట్ల గ్రామానికి చెందిన పాస్తం స్వప్న, ఆమె సోదరులు పరమేష్, దుర్గేష్‌ల ఇల్లు భారీ వర్షాలకు పూర్తిగా కూలిపోవడంతో సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.అనంతరం ఎమ్మార్వో (ఎంఆర్ఓ), ఆర్డీఓ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన జీవన్ రెడ్డి, పూర్తిగా కూలిపోయిన ఇంటికి ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం అర్హత మేరకు పూర్తి నష్టపరిహారం అందజేయాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున శాశ్వత గృహం మంజూరు చేయాలని సూచించారు.దీనిపై స్పందించిన అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి నివేదిక సిద్ధం చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన జీవన్ రెడ్డి, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా తాను కృషి చేస్తానని, ఇల్లు మంజూరు అయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కొత్త ఇంటి నిర్మాణం ప్రారంభిస్తే తమ వంతుగా కూడా ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. అలాగే తక్షణ అవసరాల కోసం వ్యక్తిగతంగా నగదు సహాయం అందజేశారు.



నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండ..

జిల్లా ఇంచార్జి మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రగుడు వద్ద రూ. 3.22 కోట్లతో జంక్షన్ అభివృద్ధి పనుల ప్రారంభం

అర్హులైన నేతన్నలకు త్రిఫ్ట్ ఫండ్ ఆర్డీ పాస్‌బుక్‌ల పంపిణీ

సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త



సిరిసిల్ల నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. నేతన్నలకు ఏడాది పొడవునా పని కల్పించడంతో పాటు భద్రత, భీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం అధిక ధర చెల్లించాల్సి వచ్చినా నాణ్యమైన చీరలనే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. యార్న్ డిపో ఏర్పాటుతో చేనేత సహకార సంఘాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, నేతన్నల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు.



నాణ్యమైన చీరల ఉత్పత్తి..

సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు పని కల్పిస్తూ నాణ్యమైన చీరలు మహిళలకు అందిస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నేతన్న.. గీతన్న వేరు కాదని, జిల్లా నేతగా నేతన్న ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సిరిసిల్ల మోడల్ చీర మహిళలకు అందుబాటు ధరలో ఒకటి తయారు చేసి.. జీ ఐ ట్యాగ్ వచ్చేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. 2024-25 సంవత్సరానికి 6.80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది మంది నేతన్నలకు ఎనిమిది నెలలపాటు ఉపాధి కల్పించామని తెలిపారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు అందించామని, ఇప్పటికే దాదాపు కోటి మీటర్ల చీరల ఉత్పత్తి పూర్తైందని తెలిపారు. మరో మూడు కోట్లకు పైగా మీటర్ల చీరల ఉత్పత్తికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 62 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామని వెల్లడించారు. నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్న ఆది శ్రీనివాస్, 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు రూ.2 విద్యుత్ సబ్సిడీ అమలులోకి తీసుకురావడం ద్వారా పరిశ్రమకు ఊతమిచ్చిందన్నారు. రూ.50 కోట్లతో వేములవాడ లో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నేతన్నల వృత్తి గౌరవాన్ని చాటిచెప్పేలా సిరిసిల్ల కలెక్టరేట్ సర్కిల్ వద్ద రూ.3 కోట్లతో వస్త్రం తయారీ దశల విధానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు నేతన్న వృత్తి గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దామని తెలిపారు. వారిపై గౌరవం, ప్రేమతో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ పేకే మహేందర్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణే ధ్యేయంగా యంత్రాంగం అప్రమత్తం

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారీ వర్షాలు, వరద పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అధికారులందరూ తమ తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల్లో నమోదైన వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగాన్ని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైనట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు టామ్‌టామ్ నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు, పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈ ఆర్‌అండ్‌బీ భావ్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఆర్డీవో గంగయ్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మహాలక్ష్మితో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన

కోరుట్ల మీదుగా బాసరకు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభించిన మంత్రులు

వేములవాడ టౌన్ ప్రభాత వార్త



మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పక్కాగా అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ-కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు సిబ్బంది నియామకాలు కూడా చేపడుతున్నామని వెల్లడించారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు రోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు.కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వరుణ పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని , వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులకు ఈ ఆధునీకరించిన బస్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.249.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు చాపలు వేటకు వెళ్ళరాదు

-జిల్లా మత్స్య శాఖ అధికారి సురేష్ బాబు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జిల్లాలో భారీ వర్షములు కురుస్తునందున మత్స్యకారులు ఎవరు చెరువులు, రిజర్వాయర్లు కుంటలు, వాగులు, కెనాన్లు వంటి వాటిలోకి చేపల వేటకు మరియు వలలు ఇతరత్ర వస్తువులు తీయటానికి వెళ్ళారాదని జిల్లా మత్స్య శాఖ అధికారి సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతరులు ఎవరైనా చెరువులు, కుంటలు, వాగులు, రిజర్వాయర్ల వద్దకు వెళ్ళి వరదల్లో చిక్కుకున్న వారిని మత్స్యకారులు రక్షించాలి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో ఆ ప్రమాదంలో ప్రజలు చిక్కుకున్నట్లయితే మత్స్యకారులు వారినీ కాపాడాలని మత్స్యకారులు తమ బాధ్యతగా రెస్క్యూటీం లో భాగం కావాలని పేర్కొన్నారు

పారదర్శకంగా యూరియా పంపిణీ

2 లక్షల 83 వేల బస్తాలు బుకింగ్

2 లక్షల 23 వేల మంది రైతులకు యూరియా అందజేత

జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపిణీ ప్రక్రియ విజయవంతంగా, అత్యంత పారదర్శకంగా కొనసాగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 78,577 మంది రైతులు యాప్ ద్వారా 2,83,100 యూరియా బస్తాలను బుక్ చేసుకోగా, ఇప్పటికే 2,28,748 బస్తాల విక్రయాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు.రైతులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఇంటి వద్ద నుంచే సులువుగా ఎరువులను బుక్ చేసుకునే సదుపాయం కలగడంతో సమయం ఆదా అవ్వడమే కాకుండా, షాపుల వద్ద క్యూలలో వేచి ఉండే అవసరం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1,00,572 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరాలకు తగినట్లుగా సరఫరా శరవేగంగా కొనసాగుతోందని చెప్పారు. జిల్లాలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నందున రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.అదే సమయంలో ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.జిల్లాలోని ఎరువుల డీలర్లు యూరియా,డిఎపి,ఇతర ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే అధిక ధరలకు విక్రయించినా,లేదా రైతులను బలవంతం చేస్తూ ఇతర ఉత్పత్తులను లింక్ చేసి అమ్మినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా డీలర్లు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు గమనిస్తే రైతులు వెంటనే సమీపంలోని వ్యవసాయ అధికారులకు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరారు.

విజయవంతంగా ముగిసిన ఉర్దూ అనువాద శిక్షణ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉర్దూ అనువాద శిక్షణ శిబిరం గురువారం ముగిసింది.కంప్యూటర్ మరియు ఆధునిక డిజిటల్ సాధనాల వినియోగంతో ఉర్దూ అనువాదం అనే అంశంపై విద్యార్థులకు, అధ్యాపకులకు ఈ ప్రత్యేక శిక్షణ అందించారు.ఈ శిక్షణ శిబిరం ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉర్దూ అధికారి,సీనియర్ జర్నలిస్టు మహ్మద్ అఖీల్ ప్రసంగిస్తూ, ప్రస్తుత కాలంలో టెలివిజన్ ఛానళ్లు, న్యూస్ పోర్టల్స్, వెబ్ మీడియా, సామాజిక మాధ్యమాలు శరవేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. ఈ డిజిటల్ యుగంలో ఉర్దూ అనువాదకులకు విస్తృత స్థాయి ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని స్పష్టం చేశారు.వార్తల అనువాద ప్రక్రియలో వేగం, ఖచ్చితత్వం, భాషా నైపుణ్యంతో పాటు సందర్భోచిత పదప్రయోగం అత్యంత కీలకమని ఆయన నొక్కి చెప్పారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా అనువాదకులు కృత్రిమ మేధ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అదే సమయంలో మానవీయ విలువలు, భాషా స్వచ్ఛత తగ్గకుండా చూసుకోవాలని సూచించారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు ఉర్దూ అనువాదంలోని సిద్ధాంత పరమైన, ప్రాయోగిక అంశాలతో పాటు ఆధునిక డిజిటల్ సాధనాలపై పరిపూర్ణ అవగాహన లభించిందని తెలిపారు. ఇటువంటి శిక్షణ మీడియా, విద్య, ప్రభుత్వ, పరిశోధనా రంగాల్లో విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమ సమన్వయకర్త ఖాసీం అలీ బేగ్ మాట్లాడుతూ రెండు రోజుల శిక్షణా విశేషాలను సభకు వివరిస్తూ, డిజిటల్ సాంకేతికతతో కూడిన ఉర్దూ అనువాదంలో ప్రత్యక్ష అనుభవం పొందేలా శిక్షణ పూర్తి చేశామని తెలిపారు.ఈ ముగింపు వేడుకలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రయ్య, శాతవాహన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ మునవ్వర్ అలీ, ఉర్దూ అధ్యాపకులు ఇర్ఫానా, యాస్మిన్ సుల్తానా, ఇతర అధ్యాపకులు ప్రొఫెసర్ వి. వరప్రసాద్, డాక్టర్ సంగీత రాణి, జి. రామచంద్రమ్, ఎస్. మల్లికార్జున్, డాక్టర్ వి. జమున, జి. నీరజ, డాక్టర్ జి. శ్రీలత తదితరులు పాల్గొన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అధ్యాపకులు, విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు.



చింతకుంట చెరువు మత్తడిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



భారీ వర్షాల నేపథ్యంలో చింతకుంట చెరువు మత్తడి నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పరిశీలించారు.భారీ వర్షాల నేపథ్యంలో జగిత్యాల పట్టణంలోని సలీమా గార్డెన్ సమీపంలో చింతకుంట చెరువు మత్తడి నుంచి వస్తున్న నీటి ప్రవాహ పరిస్థితిని జిల్లా కలెక్టర్ శ్రీ సత్యప్రసాద్ గారితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సమిండ్ల వాణి శ్రీనివాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా, వర్షపు నీరు వేగంగా వెళ్లేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన యంత్రాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.మున్సిపల్ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి, వర్షాల కారణంగా ఏర్పడే సమస్యల పరిష్కారానికి వేగంగా స్పందిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త.



జగిత్యాల పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సమిండ్ల వాణి శ్రీనివాస్ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వర్షం, ఎండ అనే తేడా లేకుండా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వర్షాకాలంలో విధులు నిర్వహించే కార్మికులు తమ ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రెయిన్‌కోట్లు తప్పనిసరిగా ధరించి విధులు నిర్వహించాలని సూచించారు.పట్టణంలో ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉన్నా, డ్రైనేజీల్లో ఆటంకాలు ఏర్పడినా, చెట్లు విరిగి పడినా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించేలా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు పిట్ట ధర్మరాజు, కూతురు రాజేష్, ఏ.ఈ. అశోక్ రాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్తో పాటు సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో గౌడ్ అన్నలు జాగ్రత్తగా ఉండాలి

గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్

బోయిన్ పల్లి (ప్రభాతవార్త)

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గౌడ అన్నలు వర్షాకాలంలో పలు జాగ్రత్తలతో ఉండాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ వర్షాకాలంలో తాటి చెట్లపై పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అదేవిధంగా వర్షం పడడం వల్ల తాటి చెట్టు ఎక్కేటప్పుడు జారే అవకాశం ఉంటుంది కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించుకోవచ్చు అని గౌడ్ అన్నలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గౌడ సంఘం నాయకులు బత్తిని అనిల్ గౌడ్, మూల కరుణాకర్ గౌడ్, తాళ్లపల్లి గణేష్ గౌడ్ పాల్గొన్నారు.

సివిల్స్2027 ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా బిసి అభివృద్ధి అధికారి జె. రంగారెడ్డి

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:

తెలంగాణ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగ, నైపుణ్య అభివృద్ధి, శిక్షణ కేంద్రం, హైదరాబాద్ వారిచే సివిల్స్ 2027 (ప్రిలిమ్స్ కమ్‌మెయిన్స్) ఉచిత శిక్షణ కొరకు ఏదైనా డిగ్రీ అర్హులైన బీసీ, ఎస్సీ,ఎస్టి ,మైనారిటీ, ఈ బీసీ నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె.రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాకు చెందిన యువత నుండి ఆన్లైన్ ద్వారా అప్లికేషన్స్ స్వీకరిస్తున్నామని, ఆగస్టు 7వ తేదీ లోపు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆగస్టు 16న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి, 19న ఫలితాలు, ఆగస్టు 21 ద్రువపత్రాల పరిశీలన, ఆగస్టు 24 నుండి మొత్తం 150 మందికి హైదరాబాద్ లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకి రూ.5 వేల చొప్పున స్టైఫండ్, పుస్తకాల కోసం మరో రూ.5 వేలు ఇస్తామన్నారు.మరిన్ని వివరాలకు 04024071178, 7780359327 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర



పెద్దపల్లి, ప్రభాతవార్త: వర్షాల నేపథ్యంలో ప్రజలు అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర కోరారు. గురువారం జిల్లాలో నిరంతరం కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు అంటువ్యాధులు సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉందని హెచ్చరించారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన చేసుకొని అంటువ్యాధులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఈగలు, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని తెలియజేశారు.

భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

బోయిన్ పల్లి మండల ఎమ్మార్వో ఎండి జలీల్ మొయినుద్దీన్

బోయిన్ పల్లి (ప్రభాత వార్త) భారీ వర్షాలు కురుస్తున్నందున బోయిన్ పల్లి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని బోయిన్ పల్లి మండల ఎమ్మార్వో ఎండి జలీల్ మొయినుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. చెరువులు, కుంటలు పొంగి పొర్లే అవకాశం ఉంది కాబట్టి ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదని , అత్యవసర సమస్యలు ఏమైనా ఉంటే గ్రామం మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

స్కాలర్‌షిప్, రియంబర్స్మెంట్‌లు విడుదల చేయాలి

బీసీ రాజ్యాధికార రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్

బోయిన్‌పల్లి మండలం, (ప్రభాత వార్త) తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు,రియంబర్స్మెంట్ లు విడుదల చేసి విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేష్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థిని, విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు రీ ఎంబర్స్ మెంట్ లు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీసీ రాజ్యాధికార సమితి నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువులకు సన్మానం

బోయిన్ పల్లి (ప్రభాతవార్త) లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా కవి వేద పండితులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. మరిగంటి అనంత ఆచార్య కవి పండితులు గోవర్ధనగిరి రాజ్ కుమార్ ఆచార్య పురోహితులు సంపత్ కుమార్ ఆచార్య కవి యోగ పండితులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అన్నమనేని శ్రీనివాస్ కార్యదర్శి కోశాధికారి సత్యనారాయణ రాజు ఉపాధ్యక్షులు కాసుకంటి రమణారెడ్డి కోఆర్డినేటర్ గడప కోటేష్ కుమార్ మాజీ అధ్యక్షులు కొండం అంజిరెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధి లయన్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



రాంరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చాడ

రామడుగు, ప్రభాతవార్త



మండలంలోని కొక్కెరకుంట గ్రామానికి చెందిన తొట్టు రాంరెడ్డి చిగురు మామిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. గత నాల్గు రోజుల క్రితం అయన మరణించగా గురువారం నాడు సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కొక్కెరకుంట లోని రాంరెడ్డి కుటుంబాన్ని చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎంపిడివో గా చిగురుమామిడి మండలంలో పనిచేసిన కాలంలో మండల అభివృద్ధిలో రాంరెడ్డి సేవలు ఉన్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హులైన వారికి అందించడం లో పారదర్శకతతో పనిచేశారని, ఎంపీపీగా నేను మూడు పర్యాయాలు పనిచేసిన కాలంలో రాంరెడ్డి ఎంపిడివో గా విధులు నిర్వర్తించారని, ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఎక్కడ కలిసినా ఎంతో ఆప్యాయంగా పలకరించే వారని, ఆయన జ్ఞాపకాలను వెంకటరెడ్డి గుర్తు చేసుకున్నారు. రాంరెడ్డి లాంటి మంచి మనిషి మృతి చెందడం అత్యంత బాధాకరమని, ముఖ్యంగా వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని, ఆయన మృతిపట్ల సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ ఉన్నారు.

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ని కలిసిన డాక్టర్ రఘు

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:

తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జిగా డాక్టర్ రఘు ని



నియమించిన సందర్భంగా బుధవారం హైదరాబాద్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో మెట్ పల్లి, కోరుట్ల టీఆర్ఎస్ అనుచరులతో పాటై అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి బాధ్యతను అప్పగించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు కోరుట్ల నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యతగా ఈ నియామకాన్ని భావిస్తున్నన్నారు. పాంచజన్య సంకల్పాన్ని సాకారం చేసేందుకు, పార్టీ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. అలాగే పార్టీ అనుబంధ సంఘాలను మరింత శక్తివంతం చేస్తూ, సబ్బండ వర్గాలకు సముచిత అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు, యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థులతో కలిసి ప్రజా సమస్యలపై మరింత పోరాటాన్ని విస్తృతం చేయడానికి నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కోరుట్ల నియోజకవర్గ ప్రజల సహకారం, ఆశీర్వాదాలతో ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తానని తెలియజేశారు. ఈ అవకాశం కల్పించిన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కి మరోసారి కృతజ్ఞతలుఖి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

ప్రోటోకాల్ ఉల్లంఘనపై మున్సిపల్ సమావేశంలో కోఆప్షన్ సభ్యురాలి నిలదీత

రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదు?

అధికారులను ప్రశ్నించిన కోఆప్షన్ సభ్యురాలు షాద్మా రైస్



మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త : మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కోఆప్షన్ సభ్యురాలు షాద్మా రైస్ పలు ప్రజా సమస్యలతో పాటు ప్రోటోకాల్ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఇటీవల రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జువ్వాడి నర్సింగరావుకు పట్టణంలో జరిగే అధికారిక సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ వేడుకల సమాచారాన్ని ఎందుకు అందించడం లేదని ఆమె అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం నియమించిన కార్పొరేషన్ చైర్మన్‌కు ప్రోటోకాల్ ప్రకారం ఇవ్వాల్సిన గౌరవం, సమాచారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆమె పేర్కొన్నారు. పట్టణంలో జరిగే అధికారిక కార్యక్రమాలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, సమీక్ష సమావేశాలకు సంబంధించిన సమాచారాన్ని ముందస్తుగా జువ్వాడి నర్సింగరావుకు తెలియజేయాలని మున్సిపల్ చైర్మన్‌తో పాటు అధికారులను ఆమె కోరారు. ప్రభుత్వ ప్రోటోకాల్ నిబంధనలను అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో షాద్మా రైస్ విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై అధికారులు సానుకూలంగా స్పందించి నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని తెలిపారు

సాదాసీదాగా మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

22 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం వీధి దీపాలు, డ్రైనేజీలు, కల్వర్టులు, సీసీ రోడ్లపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి



మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త : మెట్‌పల్లి పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 22 అంశాలను చర్చకు తీసుకురాగా, కౌన్సిల్ సభ్యులు వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్లు పట్టణంలో వీధి దీపాల సమస్య అధికంగా ఉందని, నాణ్యమైన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని వార్డుల్లో వర్షపు నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, దెబ్బతిన్న కల్వర్టులు, మురుగు కాలువలను తక్షణమే పునర్నిర్మించాలని, కొత్త సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీనికి స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వార్డుల్లో అవసరమైన ముందస్తు చర్యలు చేపడతామని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను ప్రజలు వెంటనే ఖాళీ చేసి ప్రాణనష్టాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, డీఈఈ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడో వార్డులో కూలిన ఇళ్లు..

పరిశీలించిన డీఎస్పీ రాములు



మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త : మెట్ పల్లి పట్టణ పరిధిలోని మూడో వార్డులో కూలిపోయిన ఇళ్లను పోలీసు ఉన్నతాధికారులు గురువారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఎస్పీ రాములు నేతృత్వంలో సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును, జరిగిన ఆస్తి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాములు మాట్లాడుతూ బాధితులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని, జరిగిన నష్టంపై అధికారులతో మాట్లాడి బాధితులకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సీఐ సురేష్ బాబు మాట్లాడుతూ పాతబడిన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండే ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకరంగా ఉన్న భవనాల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీరి వెంట కౌన్సిలర్ బత్తుల నరేష్, బత్తుల భరత్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి...

అపరిచితులను నమ్మి మోసపోవద్దు...

గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో విద్యార్థులు ఎవరిని పడితే వారిని నమ్మి మోసగాళ్ల చేతికి చిక్కవద్దని గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్ సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్ మాట్లాడుతూ... గుర్తుతెలియని వ్యక్తులతో మాట్లాడటం, స్నేహం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. మానవ అక్రమ రవాణా సంపూర్ణ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా మసలుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కంప అక్షయ, డి.ఎల్.ఎస్.ఏ మెంబర్ మంగళపల్లి రాజ్ కుమార్ మరియు పాఠశాల హెచ్ఎం లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ ఆదుకోవాలని బాధితుల వేడుకోలు...

మహాదేవపూర్, జులై 30, ప్రభాతవార్త

కాళేశ్వరం రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మజీద్ పల్లి ఇంటి గోడ కూలిపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. నివాసం కోల్పోయిన బాధితులు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తమకు ఆర్థిక సహాయం అందించి, నివాస సౌకర్యం కల్పించాలని వేడు కుంటున్నారు. సంఘటనపై అధికారులు స్పందించి తక్షణమే నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

భూ సర్వే గ్రామసభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

మొగుళ్లపల్లి, జూలై 30, ప్రభాత వార్త:

మండలంలోని రంగాపురం, ములకలపల్లి, వేములపల్లి గ్రామాలలో రైతు వేదికలలో నిర్వహించిన భూ సర్వే గ్రామసభలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూ సర్వే ద్వారా గ్రామాల సరిహద్దులు, రైతుల భూములకు శాశ్వత హద్దులు ఏర్పడతాయని, నిజమైన యజమానులకు ఖచ్చితమైన పట్టా పాస్‌బుక్‌లు అందజేయడమే దీని ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. భూ వివాదాల పరిష్కారంతో పాటు రైతు భరోసా, పంటల కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, సర్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.